వాయిస్ ఆఫ్ ప్రజలు
TGTEL/25/A2649
# వాయిస్ టుడే
VOICE OF PRAJALU
తెలుగు దినపత్రిక
www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com
జనగాత్రం - మననేత్రం
Follow
పేజీలు 10
గురువారం, ఫిబ్రవరి 12, 2026
HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD

## హసీనా శకం ముగిశాక బంగ్లాదేశ్‌లో తొలిసారి నేడు ఎన్నికలు

బంగ్లాదేశ్‌లో 13వ పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ గురువారం ప్రారంభమైంది. గత 15 ఏళ్లుగా అధికారంలో ఉన్న షేక్ హసీనా ప్రభుత్వం 2024లో భారీ విద్యార్థి ఉద్యమంతో కూలిపోయిన తర్వాత జరుగుతున్న తొలి జాతీయ ఎన్నికలు ఇవి. ప్రస్తుతం నోబెల్ గ్రహీత మహమ్మద్ యూనస్ నేతృత్వంలోని మధ్యంతర ప్రభుత్వం ఈ ఎన్నికలను నిర్వహిస్తోంది. ఈ ఎన్నికల ఫలితాలు బంగ్లాదేశ్ భవిష్యత్తుతో పాటు భారత్‌కు కూడా అత్యంత కీలకంగా మారాయి.



# 73.01% ఓటింగ్

రాష్ట్రవ్యాప్తంగా ప్రశాంతంగా మున్సిపల్ ఎన్నికలు

116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లలో పోలింగ్ పూర్తి

మున్సిపాలిటీల్లో 75.88%, కార్పొరేషన్లలో 66.05% నమోదు

సంగారెడ్డి, నిజామాబాద్ ఘటనలపై నివేదిక కోరిన ఎస్ఈసీ

రేపు ఓట్ల లెక్కింపు.. టేబుళ్ల చుట్టూ తొలిసారి ఫెన్సింగ్

హైదరాబాద్: రాష్ట్రంలోని 123 పురపాలక సంఘాలకు బుధవారం నిర్వహించిన సాధారణ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మొత్తం కలిపి 73.01 శాతం పోలింగ్ నమోదైనట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. 116 మున్సిపాలిటీల్లో 75.88 శాతం, 7 మున్సిపల్ కార్పొరేషన్లలో 66.05 శాతం ఓటింగ్ నమోదైంది. మున్సిపాలిటీల్లో చౌటుప్పల్‌లో అత్యధికంగా 91.91 శాతం పోలింగ్ జరగగా, నందికొండలో అత్యల్పంగా 59.68 శాతం నమోదైంది. కార్పొరేషన్లలో నల్లగొండ 77.36 శాతంతో ముందంజలో ఉండగా, నిజామాబాద్ 59.12 శాతంతో చివరిస్థానంలో నిలిచింది. చెదురుమదురు ఘటనలు మినహా ఎక్కడా పెద్ద అంతరాయాలు కలగలేదని ఎన్నికల సంఘం వర్గాలు తెలిపాయి. రీపోలింగ్ అవసరం ఎక్కడా ఏర్పడలేదని స్పష్టం చేశాయి. అయితే నిజామాబాద్‌లో బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్, సంగారెడ్డిలో కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి పోలీసులతో అనుచితంగా ప్రవర్తించిన ఘటనలపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని సంబంధిత ఎస్పీల నుంచి నివేదికలు కోరినట్లు సమాచారం.

### కంట్రోల్ రూమ్ నుంచి పర్యవేక్షణ


ఎస్ఈసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ద్వారా పోలింగ్ సరళిని నిశితంగా పరిశీలించారు. కమిషనర్ రాణి కుముదిని, డీజీపీ శివధర్‌రెడ్డి, ఇతర ఉన్నతాధికారులతో కలిసి వెబ్‌కాస్టింగ్ ద్వారా సున్నిత కేంద్రాల పరిస్థితులను సమీక్షించారు. రూట్ మొబైల్ ఫోర్స్,



స్ట్రైకింగ్ ఫోర్స్, ప్రత్యేక బృందాల కదలికలను గూగుల్ మ్యాపింగ్‌తో అనుసంధానం చేసి రియల్‌టైమ్‌లో పర్యవేక్షించారు. జనరల్, మైక్రో అబ్జర్వర్లు పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పించారు. కొన్నిచోట్ల సౌకర్యాల లోపంపై ఫిర్యాదులు వచ్చినప్పటికీ, సమయానికి పరిష్కరించినట్లు అధికారులు తెలిపారు. పోలింగ్ ముగిసిన

(మిగతా 2వ పేజీలో)





# 3 కార్పొరేషన్లుగా హైదరాబాద్ విభజన

జీహెచ్ఎంసీ, సైబరాబాద్, మల్కాజిగిరిగా పునర్వ్యవస్థీకరణ

పరిపాలన సౌలభ్యం, ప్రజాసేవల మెరుగుదలే లక్ష్యంగా ప్రభుత్వం నిర్ణయం

3 కార్పొరేషన్లకు స్పెషల్ ఆఫీసర్‌గా జయేశ్‌రంజన్ నియామకం

కమిషనర్లుగా కర్ణన్, వినయ్‌కృష్ణారెడ్డి, జి.సృజన బాధ్యతలు

వెంటనే అమల్లోకి.. గెజిట్‌కు చర్యలు.. 3 వెబ్‌సైట్లు.. త్వరలో 'టీ క్యూర్' యాప్

హైదరాబాద్: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ రూపురేఖలు పూర్తిగా మారాయి. ఇటీవల 150 నుంచి 300 వార్డులకు విస్తరించిన జీహెచ్ఎంసీని ప్రభుత్వం మూడు కార్పొరేషన్లుగా విభజించింది. జీహెచ్ఎంసీ, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్‌లుగా పునర్వ్యవస్థీకరిస్తూ బుధవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఓఆర్ఆర్ లోపలి ప్రాంతాన్ని కవర్ చేసే తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ (టీ క్యూర్) పరిధిలో ప్రస్తుతం 12 జోన్లు, 60 సర్కిళ్లు, 300 వార్డులతో ఉన్న వ్యవస్థను మూడు భాగాలుగా విభజించినట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. ఏ కార్పొరేషన్ పరిధిలో ఏయే జోన్లు ఉంటాయన్న వివరాలను ఉత్తర్వుల్లో పేర్కొంది. జీహెచ్ఎంసీ చట్టం ప్రకారమే ఈ మూడు కార్పొరేషన్లను ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వం తెలిపింది. ప్రతి కార్పొరేషన్ స్వతంత్ర సంస్థగా పనిచేస్తుందని పేర్కొంది. ఈ ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి వస్తాయని

(మిగతా 2వ పేజీలో)



## దేశాన్ని అమెరికాకు తాకట్టు పెట్టారు
## పార్లమెంట్‌లో మోదీపై రాహుల్ నిప్పులు

ఒప్పందం పేరుతో అమెరికాకు మోదీ పూర్తిగా లొంగిపోయారని విమర్శ.

వ్యవసాయ రంగాన్ని అగ్రరాజ్యానికి బార్లా తెరిచి రైతును ముంచేశారని ధ్వజం.

ఎప్స్టీన్ ఫైల్స్, అదానీ కేసు ఒత్తిళ్ల వల్లే దేశ ప్రయోజనాలు పణంగా పెట్టారని ఆరోపణ.



## దేశాన్ని అమ్మింది కాంగ్రెస్సే
## రాహుల్ విమర్శలను తిప్పికొట్టిన నిర్మల



డబ్ల్యూటీఓకు రైతుల ప్రయోజనాలను తాకట్టు పెట్టింది కాంగ్రెస్సేనని విమర్శ.

రూ.53.47 లక్షల కోట్ల వ్యయంతో ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తున్నామని వెల్లడి.

# పుర ఎన్నికల్లో 'హస్తం'దే హవా

ఏఐసీసీ చీఫ్ ఖర్గేతో సీఎం రేవంత్ భేటీ

70% పైగా సీట్లు గెలుస్తామని ధీమా

చైర్మన్ పీఠాల్లో బీసీలు, మహిళలకు అగ్రతాంబూలం

నేడు కేంద్ర మంత్రులతో సీఎం కీలక భేటీలు

న్యూఢిల్లీ: రాష్ట్రంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ సత్తా చాటుతుందని, మెజారిటీ స్థానాలను కైవసం చేసుకుంటామని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు సీఎం రేవంత్‌రెడ్డి వివరించారు. దీంతో ఇదే ఊపుతో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లోనూ ముందుకెళ్లాలని ఖర్గే చెప్పారు. బుధవారం ఢిల్లీ వచ్చిన ఆయన నేరుగా తుగ్లక్ రోడ్డులోని అధికార నివాసానికి చేరుకున్నారు. సాయంత్రం 7 గంటల సమయంలో రాజాజీ మార్గ్‌లోని ఖర్గే నివాసంలో ఆయనతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. సీఎం వెంట ఎంపీలు మల్లు రవి, అనిల్‌కుమార్ యాదవ్ ఉన్నారు. రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిస్థితులు, మున్సిపల్ ఎన్నికలు, విజయావకాశాలపై సుమారు 30 నిమిషాల పాటు నేతలు చర్చించారు. సంక్షేమ పథకాలే గెలుపు గుర్రాలు ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీలు, రైతు రుణమాఫీ వంటి అంశాలు ప్రజల్లోకి బలంగా వెళ్లాయని, మున్సిపల్ ఎన్నికల్లో ఈ అంశాలు పార్టీకి కలిసివస్తాయని రేవంత్ వివరించారు. 70 శాతానికిపైగా స్థానాల్లో విజయం సాధిస్తామని, మెజారిటీ మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను కైవసం చేసుకుంటామని చెప్పారు. గెలిచిన మున్సిపాలిటీల్లో చైర్మన్, వైస్ చైర్మన్ల పదవుల్లో బీసీ సామాజిక వర్గం, మహిళలకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చేలా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణపై కూడా ఖర్గే, రేవంత్ చర్చించినట్లు సమాచారం. జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలపై మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని సీఎం చెప్పినట్లు సమాచారం. ఈ సందర్భంగా కొద్దిసేపు ఖర్గే, రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా సమావేశం అయినట్లు తెలిసింది. బీఆర్ఎస్, బీజేపీ పట్ల అప్రమత్తంగా ఉండండి ఇటీవల రాజకీయ, పాలనా పరమైన అంశాలు బయటకు రావడంపై ఇద్దరు నేతల మధ్య చర్చ జరిగినట్లు తెలిసింది. పార్టీ యంత్రాంగం, ప్రభుత్వం మధ్య సమన్వయం

(మిగతా 2వ పేజీలో)

# హైదరాబాద్‌లో వెయ్యి కోట్ల విలువైన భూములను కాపాడిన హైడ్రా

హైదరాబాద్‌లో రూ.1,003 కోట్ల విలువైన ప్రభుత్వ భూములను కాపాడిన హైడ్రా

జూబ్లీహిల్స్‌లో రూ.3 కోట్ల విలువైన పార్కు స్థలం స్వాధీనం, అక్రమ నిర్మాణం కూల్చివేత

ఖానామెట్‌లో రూ.1,000 కోట్ల విలువైన 5 ఎకరాల భూమికి ఫెన్సింగ్ ఏర్పాటు

ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించిన అధికారులు

కబ్జాదారులపై కేసులు నమోదు చేసి, భూములకు రక్షణ కల్పించిన హైడ్రా



హైదరాబాద్ మహానగరంలో అత్యంత విలువైన ప్రభుత్వ భూములపై కన్నేసిన కబ్జాకోరులపై 'హైడ్రా' ఉక్కుపాదం మోపుతోంది. నగరంలోని అత్యంత ఖరీదైన ప్రాంతాలైన జూబ్లీహిల్స్, ఖానామెట్‌లలో జరిగిన రెండు వేర్వేరు కబ్జా యత్నాలను భగ్నం చేసింది. ఈ చర్యల ద్వారా సుమారు రూ. 1,003 కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తులను కాపాడినట్లు అధికారులు తెలిపారు. హైడ్రా ప్రజావాణికి అందిన ఫిర్యాదుల మేరకు కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాలతో అధికారులు బుధవారం ఈ చర్యలు చేపట్టారు.

### జూబ్లీహిల్స్‌లో పార్కు స్థలం కబ్జా

జూబ్లీహిల్స్‌లోని అపోలో ఆసుపత్రి ఔట్ గేట్‌కు ఎదురుగా ఉన్న దాదాపు 2 ఎకరాల పార్కు స్థలాన్ని ఓ వ్యక్తి ఆక్రమించుకునే ప్రయత్నం చేశాడు. అక్కడ ఓ ఇంటిని అద్దెకు తీసుకుని లేడీస్ హాస్టల్ నడుపుతున్న సదరు వ్యక్తి, పార్కుకు చెందిన 150 గజాల స్థలంపై కన్నేశాడు. సుమారు 50 గజాల మేర పార్కులోకి చొచ్చుకెళ్లి పాత భవనానికి ఆనుకుని మూడు అంతస్తుల అక్రమ నిర్మాణం చేపట్టాడు. మరో 100 గజాల స్థలాన్ని తన సొంత పార్కుగా మార్చుకుని ఫార్మ్ హౌస్ తరహాలో వాడుకుంటున్నాడు. దీనిపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాలతో జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి హైడ్రా బృందాలు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపాయి. కబ్జా నిజమేనని నిర్ధారించుకుని బుధవారం మూడు అంతస్తుల అక్రమ నిర్మాణాన్ని కూల్చివేశారు. సుమారు రూ.3 కోట్ల విలువైన ఆ పార్కు స్థలానికి ఫెన్సింగ్ వేసి రక్షణ కల్పించారు. కబ్జాకు పాల్పడిన వ్యక్తిపై పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. మరో ఘటనలో, హైటెక్స్ ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ సమీపంలోని ఖానామెట్‌లో ఉన్న 5 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా కాపాడింది. గతంలో ఈ భూమిని ప్రభుత్వం ఆల్ ఇండియా

(మిగతా 2వ పేజీలో)

# 3 కార్పొరేషన్లుగా హైదరాబాద్ విభజన



ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్‌రంజన్ విడుదల చేసిన జీవో నంబర్55లో స్పష్టం చేశారు. గెజిట్ నోటిఫికేషన్‌కు అవసరమైన చర్యలు తీసుకోవాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేశారు.

**జయేశ్‌రంజన్‌కు పర్యవేక్షణ బాధ్యతలు**

మూడు కార్పొరేషన్ల కార్యకలాపాలను సమన్వయం చేయడానికి స్పెషల్ ఆఫీసర్‌గా జయేశ్‌రంజన్‌ను నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. బెంగళూరులో అనేక కార్పొరేషన్లకు ఒకే చీఫ్ కమిషనర్ ఉండే విధానం తరహాలో హైదరాబాద్‌లోనూ పర్యవేక్షణ వ్యవస్థను అమలు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

**కమిషనర్లు బాధ్యతల స్వీకారం**

జీవోలు వెలువడిన వెంటనే బుధవారం ఉదయం నుంచే అధికార యంత్రాంగం కదిలింది. జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలోని మేయర్ చాంబర్‌లో స్పెషల్ ఆఫీసర్‌గా జయేశ్‌రంజన్ బాధ్యతలు చేపట్టారు. మల్కాజిగిరి కార్పొరేషన్ కార్యాలయం (తార్నాక)లో టి.వినయ్‌కృష్ణారెడ్డి, న్యాక్‌లోని సైబరాబాద్ కార్పొరేషన్ కార్యాలయంలో జి.సృజన కమిషనర్లుగా బాధ్యతలు స్వీకరించారు. పరిధి మారడంతో ఆర్వీ కర్ణన్ మళ్లీ జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా తన చాంబర్‌లోనే బాధ్యతలు చేపట్టారు. బదిలీ అయిన సిబ్బంది ఆయా కార్యాలయాల్లో విధుల్లో చేరారు.

**డిజిటల్ సేవల్లో కొత్త మార్పులు**

మూడు కార్పొరేషన్లకు వేర్వేరుగా వెబ్‌సైట్లను సిద్ధం చేశారు. ప్రజా ఫిర్యాదుల కోసం ప్రస్తుతం ఉపయోగంలో ఉన్న 'మై జీహెచ్‌ఎంసీ యాప్'కు బదులుగా త్వరలో 'టీ క్యూర్' యాప్‌ను అందుబాటులోకి తీసుకురానున్నారు.

# దేశాన్ని అమెరికాకు తాకట్టు పెట్టారు
# పార్లమెంట్‌లో మోదీపై రాహుల్ నిప్పులు

**ఒప్పందం పేరుతో అమెరికాకు మోదీ పూర్తిగా లొంగిపోయారని విమర్శ.**

**వ్యవసాయ రంగాన్ని అగ్రరాజ్యానికి బార్లా తెరిచి రైతును ముంచేశారని ధ్వజం.**

**ఎప్‌స్టీన్ ఫైల్స్, అదానీ కేసు ఒత్తిళ్ల వల్లే దేశ ప్రయోజనాలు పణంగా పెట్టారని ఆరోపణ.**

**అమెరికా పన్నులు పెంచుతుంటే, భారత్ సున్నాకు తగ్గించడం సిగ్గుచేటని మండిపాటు.**



న్యూఢిల్లీ: అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై మోదీ సర్కారును విపక్ష నేత రాహుల్‌గాంధీ తీవ్రస్థాయిలో దుయ్యబట్టారు. ఒప్పందం పేరిట మన తల్లి భరతమాతనే అమెరికాకు అమ్మేశారంటూ నిప్పులు చెరిగారు. "వ్యవసాయం, ఇంధనంతో సహా అన్ని రంగాలనూ అమెరికా చేతికి అప్పగించేశారు. ఆ దేశానికి పూర్తిస్థాయి లొంగిపోయారు. దేశాన్ని ఇలా అడ్డంగా అమ్మేసినందుకు మీకు కనీసం సిగ్గుగా అనిపించడం లేదా?"అంటూ కేంద్రంపై విరుచుకుపడ్డారు. బుధవారం లోక్‌సభలో కేంద్ర బడ్జెట్‌పై చర్చలో రాహుల్ ప్రసంగించారు. అమెరికాతో ఏకపక్ష ఒప్పందాన్ని మోదీ సర్కారు ఎలా సమర్థించుకుంటుందని ప్రశ్నించారు. "పలు విషయాలకు సంబంధించి ప్రధాని నరేంద్ర మోదీపై అమెరికా నేరుగా విపరీతమైన ఒత్తిడి పెట్టింది. పూర్తిగా ఆయన మెడలు వంచి నొక్కిపట్టింది. అందుకే దేశాన్ని మోదీ అమెరికాకు అమ్మేశారు. కేవలం అధికారం కాపాడుకోవడానికి జాతీయ ప్రయోజనాలను పణంగా పెట్టారు. లేదంటే ఇలాంటి ఏకపక్ష ఒప్పందానికి ఆయనే కాదు, ఏ భారత ప్రధానీ అంగీకరించబోడు"అంటూ తీవ్ర ఆరోపణలు చేశారు. "మార్షల్ ఆర్ట్స్‌లో ప్రత్యర్థి మెడను దొరకబుచ్చుకున్నాక దాన్ని గట్టిగా నొక్కిపడతారు. దాంతో అతను అల్లాడిపోతాడు. లొంగిపోయానంటూ చేతులెత్తేస్తాడు. మోదీ చేసింది సరిగ్గా అదే"అంటూ ఎద్దేవా చేశారు. "వాణిజ్య ఒప్పందం ద్వారా మన రైతుల ప్రయోజనాల విషయంలో కేంద్రం పూర్తిగా రాజీ పడింది. జౌళి రంగాన్ని నేలమట్టం చేశారు. మన డేటాను, రైతులను, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లను, మన శక్తియుక్తులను, చిన్న, మధ్యతరహా వ్యాపారాలనూ అమ్మేశారు. ఇంధన భద్రతను గాలికొదిలేశారు. ఇకపై మనం ఎవరి నుంచి చమురు కొనుగోలు చేయాలో నిర్ణయించేది అమెరికాయే తప్ప మన ప్రధాని కాదు! పైగా ఆ కొనుగోళ్లను అగ్ర రాజ్యమే నిత్యం పర్యవేక్షిస్తుంటుంది. వారు చెప్పిన వాళ్ల దగ్గర కొనకపోతే మనపై మళ్లీ 50 శాతం టారిఫ్‌లు బాదుతారు. మన ఆర్థిక, ఇంధన రంగాలను మనపైకే ఆయుధాలుగా గురి పెట్టేందుకు అమెరికాను కేంద్రం అనుమతించింది"అంటూ నిప్పులు చెరిగారు. బీజేపీ ప్రయోజనాల కోసమే... వాణిజ్య ఒప్పందం పేరుతో మోదీ సర్కారు అమెరికాకు దాసోహమన్న తీరు చాలా విషాదకరమని రాహుల్ అన్నారు. "మోదీ కేవలం తాను మాత్రమే లొంగిపోలేదు. 150 కోట్ల మంది భారతీయుల భవిష్యత్తునే అమెరికాకు అప్పగించేశారు. అధికార బీజేపీ ఆర్థిక ఆయువుపట్లలో ఒకరిపై అమెరికాలో కేసు నడుస్తుండటమే ఇందుకు కారణం. సొంత పార్టీ ఆర్థిక ప్రయోజనాలను కాపాడుకోవడానికే దేశాన్ని అగ్ర రాజ్యానికి మోదీ అమ్మకం పెట్టారు"అంటూ రాహుల్ తీవ్ర ఆరోపణలు చేశారు. "డిజిటల్ వాణిజ్య నిబంధనలపై నియంత్రణను కేంద్రం పూర్తిగా అమెరికాకు వదిలేసుకుంది. డేటా లోకలైజేషన్‌ను తొలగించేసింది. అమెరికా నుంచి డేటా వరదకు గేట్లెత్తేందుకు ఒప్పుకుంది. బడా టెక్ కంపెనీలకు 20 ఏళ్ల ట్యాక్స్ హాలిడేలు ప్రకటించేసింది. మొదట్లో మనపై కేవలం 3 శాతంగా ఉండే అమెరికా టారిఫ్‌లు ఇప్పుడు 18 శాతానికి పెరిగాయి. అమెరికా వస్తూత్పత్తులపై భారత టారిఫ్‌లు మాత్రం 16 శాతం నుంచి ఏకాయెకి సున్నాకు పడిపోయాయి. అమెరికా దిగుమతులు 46 బిలియన్ డాలర్ల నుంచి ఏకంగా 146 బిలియన్ డాలర్లకు పెరగనున్నాయి"అంటూ రాహుల్ మండిపడ్డారు. "కేంద్రం మన వ్యవసాయ రంగాన్ని అమెరికాకు బార్లా తెరిచేసింది. దాంతో అక్కడి వ్యవసాయోత్పత్తులు మన మార్కెట్లను ముంచెత్తనున్నాయి. దేశ చరిత్రలోనే తొలిసారిగా మన రైతులు భారీ సంక్షోభాన్ని ఎదుర్కోనున్నారు. మోదీకి ముందు ఏ ప్రధానీ ఇలాంటి సిగ్గుచేటైన పని చేయలేదు. ఇకముందు మరే ప్రధానీ చేయబోడు"అన్నారు. అధికార పక్ష సభ్యులు పదేపదే లేచి రాహుల్ ప్రసంగానికి అడ్డుతగిలారు. ఆయన నిరాధార ఆరోపణలు చేస్తున్నారంటూ దుయ్యబట్టారు. చేతనైతే వాటికి రుజువులు చూపాలని సవాలు చేయగా అందుకు తాను సిద్ధమేనని రాహుల్ బదులిచ్చారు. మేమైతే ఇలా చేసేవాళ్లం "యుద్ధాల శకం ముగిసిందని మోదీ అంటున్నారు. కానీ నిజానికి మనమున్నదే యుద్ధాల శకంలో! ఇలాంటప్పుడు మన బలాలేమిటో అవగాహన ఉండాలి. ప్రజలే మన నిజమైన బలం"అని రాహుల్ అన్నారు. "ఇండియా కూటమే గనుక అధికారంలో ఉంటే వాణిజ్య ఒప్పందం విషయంలో పూర్తిగా భిన్నంగా వ్యవహరించేది. డేటా మన అతి పెద్ద ఆస్తి. అది అమెరికాకు అందుబాటు ఉండాలంటే భారత్‌ను అమెరికా సేవకునిలా గాక సమాన భాగస్వామిగా పరిగణించాలని ట్రంప్‌కు కుండబద్దలు కొట్టేవాళ్లం. ఆ హోదాలోనే చర్చలు జరిపేవాళ్లం. దేశ ఇంధన భద్రతపై, మన రైతుల ప్రయోజనాలపై రాజీ పడే ప్రసక్తే లేదని, వాటిపై చర్చలకు తావు లేదని ఆయన ముఖం మీదే చెప్పేవాళ్లం. పాక్ ఆర్మీ చీఫ్‌తో ట్రంప్ అల్పాహార భేటీ వంటి ఉదంతాలపై కచ్చితంగా అభ్యంతరం వ్యక్తం చేసేవాళ్లం"అని చెప్పుకొచ్చారు. ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో అంబానీ, పురీ అమెరికాతో పాటు పలు దేశాల్లో సంచలనం సృష్టిస్తున్న ఎప్‌స్టీన్ సెక్స్ కుంభకోణం టేపుల్లో కేంద్ర మంత్రి హర్దీప్‌సింగ్ పురీ, వ్యాపారవేత్త అనిల్ అంబానీ పేర్లు కూడా ఉన్నాయని రాహుల్ ఆరోపించారు. బుధవారం సాయంత్రం పార్లమెంటు ప్రాంగణంలో ఆయన మీడియాతో మాట్లాడారు.

# దేశాన్ని అమ్మింది కాంగ్రెస్సే: రాహుల్ విమర్శలను తిప్పికొట్టిన నిర్మల

**డబ్ల్యూటీఓకు రైతుల ప్రయోజనాలను తాకట్టు పెట్టింది కాంగ్రెస్సేనని విమర్శ.**

**రూ.53.47 లక్షల కోట్ల వ్యయంతో ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తున్నామని వెల్లడి.**

**జీఎస్టీపై స్పష్టత: పాలు, విద్య, అంతిమక్రియలపై పన్ను వేయలేదని టీఎంసీకి కౌంటర్.**

**శాంతిభద్రతలు: పశ్చిమ బెంగాల్‌లో చట్టం కాకుండా బాంబులే మాట్లాడుతున్నాయని ఎద్దేవా**



న్యూఢిల్లీ: వాణిజ్య ఒప్పందం పేరిట దేశాన్ని మోదీ సర్కారు అమెరికాకు అమ్మేసిందన్న విపక్ష నేత రాహుల్‌గాంధీ వ్యాఖ్యలపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మండిపడ్డారు. "దేశ ప్రయోజనాలను ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ) వంటి అంతర్జాతీయ సంస్థలకు తాకట్టు పెట్టింది కాంగ్రెస్ సారథ్యంలోని యూపీఏ ప్రభుత్వమే. పేదలు, రైతుల ప్రయోజనాలను వాటికి అమ్మేసింది. ఏకంగా దేశాన్నే అమ్మేసింది"అంటూ దుయ్యబట్టారు. కేంద్రంలో అధికారంలో ఉండగా షెర్మెల్ షేక్ చర్చల సందర్భంగా దేశాన్ని దాయాది పాకిస్తాన్‌కు తనఖా పెట్టిన, ఏకంగా మన సార్వాకమత్వం విషయంలో రాజీ పడ్డ చరిత్ర కూడా కాంగ్రెస్‌దేనని ఎద్దేవా చేశారు. కేంద్ర బడ్జెట్ 202627పై లోక్‌సభలో జరిగిన చర్చకు నిర్మల బుధవారం సాయంత్రం బదులిచ్చారు. మన దేశాన్ని అమ్మగల, కొనగల వాడెవరూ పుట్టలేదంటూ పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెణ్ రిజిజు చేసిన వ్యాఖ్యలను ఆమె పునరుద్ఘాటించారు. ప్రధాని నరేంద్ర మోదీ అలాంటి పని ఎప్పటికీ చేయబోరని స్పష్టం చేశారు. ఇంధన, ఆర్థిక, ఆహార, డేటా భద్రత తదితరాలపై రాహుల్ లేవనెత్తిన ఆందోళనలను కొట్టిపారేశారు. ఆ విషయాల్లో అవసరమైన అన్ని చర్యలూ కేంద్రం తీసుకుందని, బడ్జెట్‌లో వాటికి చాలినన్ని నిధులు కేటాయించిందని చెప్పారు. సంబంధిత గణాంకాలను సభకు చదివి వినిపించారు. రాహుల్ అసలు బడ్జెట్‌నే చదవకుండా నిరాధార ఆరోపణలకు దిగారని మండిపడ్డారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వ వ్యయాన్ని రూ.53.47 లక్షల కోట్లుగా అంచనా వేసినట్టు నిర్మల సభకు తెలిపారు. "మా ప్రభుత్వం కఠినమైన ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తోంది. 2027 ఆర్థిక సంవత్సరంలో ద్రవ్య లోటు 4.3 శాతానికి పరిమితం కావచ్చు"అని అంచనా వేశారు. దేశంలో ఎరువుల కొరత ఉందన్న వార్తలను కొట్టిపారేశారు. వాటి దిగుమతికి బడ్జెట్లో ఏకంగా రూ.1.71 లక్షల కోట్లు కేటాయించామని గుర్తు చేశారు. కేంద్ర బడ్జెట్లో పశ్చిమబెంగాల్‌కు కేటాయింపులే లేవన్న తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఆరోపణలను నిర్మల తీవ్రంగా ఖండించారు. ఆ పార్టీ ఏలుబడిలో రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా మంటగలిశాయంటూ మమతా బెనర్జీ సర్కారు పనితీరును దుయ్యబట్టారు. బెంగాల్లో ఎక్కడ చూసినా బాంబుల సంస్కృతే రాజ్యమేలుతోందని ఆరోపించారు. 'బెంగాల్లో బాంబులే మాట్లాడతాయి, చట్టాలు కాదు'అంటూ పలు ఉదంతాలను ఉటంకించారు. దాంతో విపక్ష సభ్యులు పెద్దపెట్టున నినదిస్తూ నిరసన వ్యక్తం చేశారు. పాలు, స్టేషనరీ, విద్యపై జీఎస్టీ వసూలు చేస్తున్నారన్న తృణమూల్ కాంగ్రెస్ సభ్యుడు అభిషేక్ బెనర్జీ చేసిన వ్యాఖ్యలను నిర్మల తీవ్రంగా ఖండించారు. "వాస్తవాలను ఆయన ఉద్దేశపూర్వకంగా పూర్తిగా వక్రీకరించారు. పెన్సిళ్లు, షార్పనర్లపైనా జీఎస్టీ వేశామట! మరీ ఈ స్థాయిలో అబద్ధాలా? 2017లో జీఎస్టీని ప్రవేశపెట్టిన నాటి నుంచీ పాలపై ఎన్నడూ జీఎస్టీ విధించలేదు. చావుపైనా జీఎస్టీ వేశారని పచ్చి అబద్ధాలు చెప్పారు. అంతిమక్రియలపై కూడా ఎప్పుడూ జీఎస్టీ లేదు. వింటున్న సభ్యులకు తెలివి లేదని అభిషేక్ భావిస్తున్నారా?"అంటూ ఆగ్రహం వెలిబుచ్చారు. బహుశా పశ్చిమబెంగాల్లో నడుస్తున్న సిండికేట్ మరణాలపైనా పన్నులు వసూలు చేస్తోందేమో అంటూ అధికార తృణమూల్‌ను ఉద్దేశించి ఎద్దేవా చేశారు. అన్యాయానికి గురయ్యామంటూ సానుభూతి కార్డు వాడటం, ప్రతిదానికీ సుప్రీంకోర్టు దగ్గరికి పరుగెత్తడం, చివరికి కోర్టుతో చీవాట్లు తినడం తృణమూల్‌కు అలవాటుగా మారిందన్నారు.




# హైదరాబాద్‌లో వెయ్యి కోట్ల విలువైన భూములను కాపాడిన హైడ్రా

వెలమ సంఘానికి కేటాయించింది. అయితే, కుల సంఘాలకు భూముల కేటాయింపుపై కొందరు కోర్టును ఆశ్రయించడంతో హైకోర్టు స్టే విధించింది. ఇదే అదనుగా కొందరు స్థానికులు వెనుక వైపు నుంచి మట్టి పోస్తూ స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నించారు. దీనిపై సంఘం ప్రతినిధులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. కోర్టు తీర్పు వెలువడే వరకు భూమిని కాపాడాలని కోరారు. దీంతో రంగంలోకి దిగిన హైడ్రా అధికారులు, సుమారు రూ.1000 కోట్ల విలువైన ఈ 5 ఎకరాల భూమి చుట్టూ ఫెన్సింగ్ వేసి, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ విధంగా ప్రజావాణి ద్వారా అందిన సమాచారంతో హైడ్రా అధికారులు సకాలంలో స్పందించి వేల కోట్ల రూపాయల ప్రభుత్వ ఆస్తులను కాపాడారు.

# 73.01% ఓటింగ్

వెంటనే బ్యాలెట్ బాక్సులను సిబ్బంది రిసీవింగ్ సెంటర్లకు తరలించారు. అనంతరం వాటిని స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరిచారు. భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించారు.

**రేపు ఓట్ల లెక్కింపు**

ఈ నెల 13న ఓట్ల లెక్కింపును నిర్వహించనున్నారు. బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు జరిగినందున లెక్కింపు ప్రక్రియ రాత్రివరకు కొనసాగే అవకాశముంది. తొలిసారిగా లెక్కింపు కేంద్రాల్లో టేబుళ్ల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయడం విశేషం.

# పుర ఎన్నికల్లో 'హస్తం'దే హవా

దెబ్బతినకుండా చూసుకోవాలని, నేతల మధ్య విభేదాలు ఉన్నా వాటిని వెంటనే పరిష్కరించుకోవాలని రేవంత్‌కు ఖర్గే హితబోధ చేసినట్లు సమాచారం. అదే సమయంలో బీఆర్‌ఎస్, బీజేపీ పట్ల అప్రమత్తంగా ఉండాలని ఖర్గే సూచించారు. ఒకవైపు బీఆర్‌ఎస్ వైఫల్యాలను ఎండగడుతూనే, మరోవైపు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణకు చేస్తున్న అన్యాయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలంటూ ఖర్గే దిశానిర్దేశం చేసినట్లు తెలిసింది. నేడు కేంద్ర మంత్రులతో భేటీ ఢిల్లీ పర్యటనలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి గురువారం రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై పలువురు కేంద్ర మంత్రులతో భేటీ కానున్నట్లు తెలిసింది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, జల వనరుల శాఖ మంత్రి సీఆర్ పాటిల్, రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి జేపీ నడ్డా, రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, ఆహార పంపిణీ శాఖ మంత్రి ప్రల్హాద్ జోషిని కలిసే అవకాశం ఉందని తెలుస్తోంది. పార్లమెంట్‌లో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతోనూ భేటీ కానున్నట్లు సమాచారం.

## నేడు భారత్ బంద్..
## బ్యాంకింగ్, రవాణా సేవలకు అంతరాయం!

**కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా బంద్**

**10కి పైగా కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు**

**సమ్మెలో 30 కోట్ల మంది కార్మికులు పాల్గొంటారని అంచనా**

**ప్రభుత్వ బ్యాంకులు, రవాణా, బీమా సేవలపై ప్రభావం**

**అత్యవసర సేవలకు బంద్ నుంచి మినహాయింపు**

కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పదికి పైగా కార్మిక, రైతు సంఘాలు గురువారం (ఫిబ్రవరి 12) 'భారత్ బంద్'కు పిలుపునిచ్చాయి. కేంద్రం అనుసరిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలను నిరసిస్తూ ఈ దేశవ్యాప్త సమ్మె నిర్వహిస్తున్నట్లు కార్మిక సంఘాల ఉమ్మడి వేదిక ప్రకటించింది. ఈ సమ్మెలో సుమారు 30 కోట్ల మంది కార్మికులు పాల్గొంటారని అంచనా వేస్తున్నారు. ఈ బంద్‌కు సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) కూడా సంపూర్ణ మద్దతు ప్రకటించడంతో దీని ప్రభావం దేశవ్యాప్తంగా పలు రంగాలపై పడనుంది. ముఖ్యంగా ప్రభుత్వ రంగ బ్యాంకులు, బీమా, రవాణా, విద్యుత్, బొగ్గు, గ్యాస్ వంటి కీలక రంగాల్లో సేవలకు అంతరాయం కలిగే అవకాశం ఉంది. ఏఐబీఈఏ, ఏఐబీవోఏ వంటి కొన్ని బ్యాంకు ఉద్యోగుల సంఘాలు సమ్మెలో పాల్గొంటున్నందున బ్యాంకింగ్ కార్యకలాపాలు పాక్షికంగా స్తంభించవచ్చు. కొత్త లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, బీమా రంగంలో 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను (ఎఫ్‌డీఐ) అనుమతించడాన్ని వెనక్కి తీసుకోవాలని, ప్రైవేటీకరణను నిలిపివేయాలని కార్మిక సంఘాలు ప్రధానంగా డిమాండ్ చేస్తున్నాయి. ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్ కౌర్ మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలపై నిరసన వ్యక్తం చేసేందుకే ఈ సమ్మెకు పిలుపునిచ్చినట్లు స్పష్టం చేశారు. అయితే, ఆసుపత్రులు, అంబులెన్సులు, ఫార్మసీలు, పాలు వంటి అత్యవసర సేవలకు బంద్ నుంచి మినహాయింపు ఇచ్చారు. ప్రైవేటు కార్యాలయాలు, ఐటీ కంపెనీలు, పాఠశాలలు, కళాశాలలు యథావిధిగా పనిచేసే అవకాశం ఉన్నప్పటికీ, స్థానిక పరిస్థితులను బట్టి వాటి మార్పులు ఉండవచ్చని తెలుస్తోంది.

# ఎప్‌స్టీన్‌తో భేటీ... రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై మండిపడిన కేంద్రమంత్రి

అమెరికాలో సంచలనం సృష్టించిన జెఫ్రీ ఎప్‌స్టీన్ ఫైల్స్ విషయంలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలపై కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి స్పందించారు. తాను ఎప్‌స్టీన్‌ను కలిసిన మాట వాస్తవమేనని, అయితే అది కేవలం వృత్తిపరమైన సందర్భంలోనే జరిగిందని స్పష్టం చేశారు. ఎప్‌స్టీన్‌పై ఉన్న లైంగిక ఆరోపణలతో తనకు ఎలాంటి సంబంధం లేదని అన్నారు. పార్లమెంట్‌లో బడ్జెట్ చర్చల సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ, ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో హర్దీప్ సింగ్ పూరి పేరు కూడా ఉందని, ఆయనకు ఎప్‌స్టీన్‌తో ఏం సంబంధమని ప్రశ్నించారు. ఈ ఆరోపణలపై బుధవారం మీడియా సమావేశంలో మంత్రి పూరి వివరణ ఇచ్చారు. "ఐక్యరాజ్యసమితిలో భారత రాయబారిగా పనిచేసిన తర్వాత నేను ఇంటర్నేషనల్ పీస్ ఇన్‌స్టిట్యూట్ (ఐపీఐ)లో చేరాను. అక్కడ నా బాస్ అయిన టెర్జే రోడ్-లార్సెన్‌కు ఎప్‌స్టీన్ తెలుసు. ఆ కారణంగానే నేను ఎప్‌స్టీన్‌ను మూడు, నాలుగు సార్లు కలిశాను. ఒక్కసారి మాత్రమే ఈమెయిల్ ద్వారా సంభాషణ జరిగింది" అని తెలిపారు. ఈ సమావేశాలకు, ఎప్‌స్టీన్‌పై వచ్చిన ఆరోపణలకు ఎటువంటి సంబంధం లేదని ఆయన నొక్కిచెప్పారు. రాహుల్ గాంధీ నిరాధార ఆరోపణలు చేయడం అలవాటుగా మార్చుకున్నారని, బాధ్యతాయుతమైన పదవిలో ఉండి ఇలా మాట్లాడటం సరికాదని విమర్శించారు. కొందరు నేతలు అప్పుడప్పుడు దేశానికి వచ్చి, పార్లమెంటులో సమాధానాలు వినకుండా వాకౌట్ చేస్తారని పరోక్షంగా రాహుల్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. అమెరికాలో సెక్స్ ట్రాఫికింగ్ ఆరోపణలు ఎదుర్కొన్న జెఫ్రీ ఎప్‌స్టీన్ 2019లో జైలులో మరణించిన విషయం తెలిసిందే. ఇటీవల ఆయన కేసులకు సంబంధించిన ఫైల్స్‌ను అమెరికా ప్రభుత్వం విడుదల చేయడంతో పలువురు ప్రముఖుల పేర్లు బయటకు వచ్చాయి. ఈ అంశం ఇప్పుడు భారత రాజకీయాల్లోనూ చర్చనీయాంశంగా మారింది.



## రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో హామీలు అమలు కాలేదు

**- మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించాలి**

**- బీఆర్ఎస్ ఉద్యమ నేత ఆర్.వి. మహేందర్ కుమార్**

హైదరాబాద్ : ఫిబ్రవరి 11(వాయిస్ టుడే): నగరంలోని కోటి బ్యాంక్ స్ట్రీట్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేతలు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు సహా 420 హామీలలో ఒక్కటీ సక్రమంగా అమలు కాలేదని ఆరోపించారు. ఈ సందర్భంగా గోషామహల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఉద్యమ నాయకులు ఆర్.వి. మహేందర్ కుమార్ మాట్లాడుతూ "ఎన్నికల సమయంలో ప్రజలను ఆకర్షించేందుకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. ధరల పెరుగుదల, నిరుద్యోగ సమస్య, అభివృద్ధి పనుల నిలకడలేమి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయని అన్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం 116 మున్సిపాలిటీలలో ఏడు మండలాల్లో జరుగుతున్న ఎన్నికలు ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పే అవకాశం ఉందన్నారు. కాంగ్రెస్ అభ్యర్థులను ఓడించి, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను ఘన విజయం సాధింపజేసి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వాన్ని మరింత బలోపేతం చేయాలని ప్రజలను కోరారు. ఈ ప్రెస్‌మీట్‌లో జి. యాదగిరి, రమేష్ గుప్త తదితరులు పాల్గొని మాట్లాడుతూ, రాష్ట్ర అభివృద్ధి బీఆర్ఎస్ పాలనలోనే సాధ్యమైందని, ప్రజలు మరోసారి బీఆర్ఎస్‌కు మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేశారు. మొత్తంగా రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి విజయాన్ని అందించి ప్రజా సమస్యలకు పరిష్కారం చూపే ప్రభుత్వాన్ని బలోపేతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.



## బీసీ యువజన నాయకుడు రుద్ర అభిరామ్ గౌడ్‌కు జాతీయ స్థాయి పదవి

**- జాతీయ కార్యదర్శిగా నియామకం**

హైదరాబాద్ : ఫిబ్రవరి 11 (వాయిస్ టుడే): బీసీ యువజన ప్రధాన కార్యదర్శిగా ఉన్న రుద్ర అభిరామ్ గౌడ్‌కు జాతీయ కార్యదర్శి (విద్యార్థి విభాగం)గా పదవి లభించింది. ఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు, బీసీ జాతీయ అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రుద్ర అభిరామ్ గౌడ్ మాట్లాడుతూ, తనపై విశ్వాసం ఉంచి ఈ బాధ్యత అప్పగించిన జాతీయ అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య కి, నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ గవ్వల భారత్ కుమార్ కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ బాధ్యతను నిబద్ధతతో నిర్వహిస్తూ బీసీ విద్యార్థుల హక్కులు, అభివృద్ధి కోసం కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు ప్రవీణ్ ముదిరాజ్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు విశాల్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళ బంగారు గొలుసు దోపిడీ

గన్‌ఫౌండ్రి: మహిళ మెడలో నుంచి బంగారు గొలుసు దోచుకున్న నిందితుడిని గంటల వ్యవధిలోనే పోలీసులు పట్టుకున్న ఉదంతం అబిడ్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అబిడ్స్ ఛాపెల్ రోడ్డులోని మల్లారెడ్డి ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తున్న శిరీష బుధవారం మధ్యాహ్నం విధులు ముగించుకుని హాస్టల్‌కు వెళ్తోంది. ఇంతలో బైక్‌పై వచ్చిన ఓ యువకుడు ఆమె మెడలోని సుమారు 2.5 తులాల బంగారు గొలుసును లాక్కొని పరారయ్యాడు. అడ్డుకునేందుకు యత్నించిన శిరీషకు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న అబిడ్స్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పరిసర ప్రాంతాల సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించి గంటల వ్యవధిలోనే నిందితుడిని యాకుత్‌పురకు చెందిన మహ్మద్ సల్మాన్ పాషాగా గుర్తించారు. మిగతా పోలీస్ స్టేషన్ల వారికి సమాచారం ఇచ్చి అప్రమత్తం చేశారు. దీంతో నార్త్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిందితుడిని పట్టుకుని తదుపరి విచారణ కోసం అబిడ్స్ పోలీసులకు అప్పగించారు.

## ఇష్టం లేని పెళ్లి చేశారని విషం తాగిన యువతి



పేట్‌బషీరాబాద్: పేట్‌బషీరాబాద్ సీఐ కె.విజయవర్ధన్ వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణం శ్రీపతినగర్‌కు చెందిన పొన్నం శ్రావణి (28) అదే ప్రాంతానికి చెందిన రంజిత్‌కుమార్‌ను 3 నెలల కిందట వివాహం చేసుకుంది. శ్రావణి సుచిత్ర కూడలి సమీపంలోని వసతిగృహంలో ఉంటూ జినోమ్ వ్యాలీ సమీపంలో ఓ పరిశ్రమలో పనిచేసేది. భర్త మంచిర్యాలలో ఓ కార్పొరేట్ విద్యాసంస్థలో పనిచేస్తూ ఇటీవల నగరానికి మారాడు. మంగళవారం ఉదయం ఫోన్ చేయడంతో జ్వరంగా ఉందని తెలిపింది. సాయంత్రం వసతిగృహం వద్దకు వెళ్లాడు. ఆమె శరీరం చల్లగా ఉండడంతో ఏం జరిగిందని ప్రశ్నించగా ఇష్టం లేని పెళ్లి చేయడంతో బతకాలని లేక విషం తాగినట్లు తెలిపింది. 108లో ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతిచెందింది.

## క్రీడలు ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయి

**తెలంగాణ విద్యార్థి ఐకాస చైర్మన్ వేముల రామకృష్ణ**

హైదరాబాద్, ఫిబ్రవరి 11: వాయిస్ టుడే: రాజేంద్రనగర్ హరి హర క్షేత్రం మైదానంలో గత మూడు రోజులుగా క్రికెట్ పోటీలు హోరాహోరీగా జరిగాయి. పలు ప్రాంతాల నుంచి 33 జట్లు పాల్గొన్నాయి. మొదటి విజేతగా రాజేంద్రనగర్ కు చెందిన పీకే టీం, రెండో విజేతగా బుద్వేల్ టీం నిలిచాయి. విజేతలకు తెలంగాణ విద్యార్థి ఐకాస చైర్మన్ వేముల రామకృష్ణ బహుమతులతో పాటు నగదు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్, సాయి కిరణ్ యాదవ్, ప్రసాద్, సంతోష్, బాలు, ప్రణయ్, చేతన్, అమన్ ,పాపి తదితరులు పాల్గొన్నారు.





## 'వాలెంటైన్స్ డే' ను నిషేధించాలి భారతీయ సంస్కృతి

**సాంప్రదాయాలకు వాలెంటైన్స్ డే వ్యతిరేకం**

**బజరంగ్ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.ఆర్. లక్ష్మణ్ రావు**

హైదరాబాద్, ఫిబ్రవరి 11: వాయిస్ టుడే: ఫిబ్రవరి 14న నిర్వహించే 'వాలెంటైన్స్ డే' ను నిషేధించాలని బజరంగ్ సేన రాష్ట్ర అధ్యక్షులు ఎన్.ఆర్. లక్ష్మణ్ రావు డిమాండ్ చేశారు. బుధవారం కాచిగూడ లోని బజరంగ్ సేన రాష్ట్ర కార్యాలయంలో వాలెంటైన్ డే ను నిషేధించాలని పోస్టర్ ను ఆయన ఆవిష్కరించారు. వాలెంటైన్స్ డే వేడుక యువతలో తీవ్ర ప్రభావం చూపుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలను చురుకుగా పర్యవేక్షించాలని, వాలెంటైన్స్ డే జరుపుకోవడం వల్ల కలిగే సాంస్కృతిక చిక్కుల గురించి వారికి అవగాహన కల్పించాలని కోరారు, ఇది భారతీయ విలువలలో పాతుకుపోయిన పాశ్చాత్య సంప్రదాయం కాదని ఆయన అభివర్ణించారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడటం, ప్రోత్సహించడం యొక్క ప్రాముఖ్యతను ఆయన నొక్కి చెప్పారు. పబ్బులు, హోటళ్ళు, మాల్స్, రిసార్ట్‌లు, ఇతర వ్యాపార సంస్థలు వాలెంటైన్స్ డేను వాణిజ్యీకరించడం పెరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. అటువంటి సంస్థలు ప్రధానంగా వాణిజ్య లాభాల కోసం ఈ సందర్భాన్ని ప్రోత్సహిస్తాయని, తన దృష్టిలో భారతీయ సంప్రదాయాలకు విరుద్ధంగా ఉన్న పాశ్చాత్య సాంస్కృతిక పద్ధతుల ప్రభావాన్ని పరిమితం చేయడంపై విస్తృత చర్చకు ఆయన పిలుపునిచ్చారు. యువతను ఉద్దేశించి ప్రవీణ్ యాదవ్ మాట్లాడుతూ.. భారతదేశ గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని యువత గర్వించాలని మరియు శివాజీ జయంతి మరియు మహా శివరాత్రి వంటి పండుగలను ఉత్సాహంగా మరియు భక్తితో జరుపుకోవాలని విజ్ఞప్తి చేశారు. భారతీయ సాంస్కృతిక విలువలను నిలబెట్టి అనుసరించాలని ఆయన వారిని ప్రోత్సహించారు. సమావేశంలో భజరంగ్ సేన ఉపాధ్యక్షుడు (తెలంగాణ) ప్రభు బిరాదార్, జాయింట్ సెక్రటరీ శ్రీమతి ఆర్తి మహేంద్రకర్, మనోజ్ మొగల్గిడ్డి, ప్రవీణ్ యాదవ్, రామేశ్వర్ మిశ్రా, అజయ్ నాయుడు, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

## రూ.32 కోట్లతో కాచిగూడ డివిజన్ అభివృద్ధి

**బీజేపీ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్**



హైదరాబాద్, ఫిబ్రవరి 11: వాయిస్ టుడే: గత ఐదు సంవత్సరాల కార్పొరేటర్ పాలనలో కాచిగూడ డివిజన్ లో రూ.32కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టినట్లు డివిజన్ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ తెలిపారు. బుధవారం నింబోలిఅడ్డ లోని బీజేపీ పార్టీ డివిజన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ డివిజన్ అభివృద్ధి కోసం మరో రూ.5 కోట్ల వరకు ప్రతిపాదనలు చేసి అధికారులకు, ప్రభుత్వానికి పంపించడం జరిగిందని తెలిపారు. డివిజన్ పరిధిలో నారాయణగూడ చౌరస్తాలో మోడల్ మార్కెట్ నిర్మాణం చేపట్టి పూర్తయిందని, త్వరలోనే మార్కెట్ను ప్రారంభించి ప్రజలకు, వ్యాపారులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆమె అధికారులను కోరారు. బీజేపీ సికింద్రాబాద్ ఎంపీ, కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి, అంబర్పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులు, సిబ్బందితో కలిసి డివిజన్ను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. ప్రజలకు ముఖ్యంగా సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, మంచినీటి, డ్రైనేజీ, వర్షపునీటి పైపులైన్ల నిర్మాణం చేపట్టామని, అవసరమైన చోట్ల పవర్ ?బర్ల ఏర్పాటు చేశామని తెలిపారు. ఐదు సంవత్సరాలుగా తనకు సహకరించిన ప్రజలకు అధికారులకు, ప్రజా ప్రతినిధులకు ఈ సందర్భంగా ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు. భవిష్యత్తులో మరిన్ని సేవలు చేసుకునే అవకాశం ప్రజలు కల్పించాలని ఆమె కోరారు. బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ సుభాష్ పటేల్, కాచిగూడ డివిజన్ అధ్యక్షుడు తంగెడిపల్లి బల్వీర్, ప్రధానకార్యదర్శి ఆర్.సంతోష్, శ్రీరాం సాయికుమార్, వాసు, బి.భీమ్ రాజ్, ఎస్.రవియాదవ్, ఎస్.అరవింద్, మల్లిఖార్జున్ తదితరులు పాల్గొన్నారు.

# శివార్లకూ హైటెక్ హంగులు

**సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన**



హైదరాబాద్: శేరిలింగంపల్లిలోని హైటెక్‌సిటీ, మాదా పూర్ ప్రాంతాలతో సమానంగా శివారులోని తెల్లాపూర్, పటాన్‌చెరు, అమీన్‌పూర్, దుండిగల్, గండిమైసమ్మ, మేడ్చల్ ప్రాంతాల్లో మౌలిక సౌకర్యాలు మెరుగు పరుస్తామని సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన ధీమా వ్యక్తం చేశారు. రాబోయే మూడేళ్లలో పట్టణ, గ్రామీ ణ ప్రాంతాల మధ్య సౌకర్యాలు, ప్రజాసేవలో వ్యత్యాసం లేకుండా అభివృద్ధిని సాకారం చేస్తామని స్పష్టం చేశారు.

ప్రధాన కర్తవ్యం: పారిశుద్ధ్యమే ప్రధాన కర్తవ్యం. ప్రజలకు నాణ్యమైన వాతావరణాన్ని ఇవ్వాలి. పరిశుభ్రమైన వీధులు, పార్కులు, బస్టాపులు, రహదారి కూడళ్లు, కాలిబాటలు అవసరం. వాటిని సాకారం చేసేందుకు కఠిన చర్యలు తీసుకోబోతున్నాం. అలాగే.. వీధిలైట్ల సమస్యను పరిష్కరించాల్సి ఉంది. రద్దీ ప్రాంతాల్లో వీధి కుక్కల సంచారాన్ని నియంత్రించాలి. మూడేళ్లలో.. ఒక్కో లక్ష్యాన్ని చేరుకుంటూ.. సీఎంసీని మెరుగైన జీవన ప్రమాణాలు గల నగరంగా తీర్చిదిద్దుతా.

**ప్రజా సమస్యల పరిష్కారానికి..**

మున్సిపాలిటీ అధికారులనగానే.. ప్రజల్లో చులకన భావం ఉంటుంది. మాట వినరని, సమస్యలను పట్టించుకోరని ప్రజలు భావిస్తుంటారు. నేను ఎక్కడ పనిచేసినా.. ప్రజల నమ్మకాన్ని పొందేందుకు ప్రాధాన్యం ఇస్తాను. ఎక్కడెక్కడి నుంచో కమిషనర్, ఇతర అధికారులను కలిసేందుకు జనం వస్తుంటారు. వారికి తప్పక సమయం ఇవ్వాలి. సామాజిక మాధ్యమాల్లో, ఫోన్, వాట్సప్, ప్రజావాణి, ఇతర మాధ్యమాల ద్వారా అందే ఫిర్యాదులకు నాతోపాటు అధికార యంత్రాంగమంతా సత్వరమే స్పందించేట్లు చర్యలు తీసుకుంటా.

**సమాన అభివృద్ధి**

పాత జీహెచ్ఎంసీలోని శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి జోన్లకు శివారులోని పది స్థానిక సంస్థలను కలిపి సీఎంసీని ఏర్పాటు చేశారు. వందలాది శివారు గ్రామాలను ప్రధాన నగరంతో సమానంగా అభివృద్ధి చేయాలి. డివిజన్ల వారీగా రోడ్లు, వరద కాలువలు, చెరువులు, పార్కులు, ప్రభుత్వ కార్యాలయాలు, సామాజిక భవనాలు, ఇతరత్రా వివరాలను సేకరించి.. అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేస్తా. మా గ్రామాలను జీహెచ్ఎంసీలో ఎందుకు విలీనం చేశారనే ప్రశ్న తలెత్తకుండా.. చర్యలు తీసుకుంటాం.



## నాణ్యమైన విద్య అందించే సంస్థలకు ప్రోత్సాహం

**సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్**

సికింద్రాబాద్, ఫిబ్రవరి 12 (వాయిస్ టుడే ప్రతినిధి): పిల్లలకు నాణ్యమైన విద్యను అందించే విద్య సంస్థలను తగిన విధంగా ప్రోత్సహిస్తామని సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ అన్నారు. సితఫలమండీ లోని శ్రీ సాయి విద్యాలయం వార్షికోత్సవాల్లో భాగంగా బుధవారం సితఫలమండీ ఎం.ఎల్.ఏ. క్యాంపు కార్యాలయం వద్ద ప్రతిభావంతులైన విద్యార్థులకు అవార్డుల ప్రధానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పద్మారావు గౌడ్ పాల్గొని మాట్లాడారు. 39 సంవత్సరాలుగా సికింద్రాబాద్ విద్యార్థులకు సాయి విద్యాలయం గ్రూపు సంస్థలు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ వెంకటేష్, మాజీ కార్పొరేటర్లు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

# బీజేపీ, బి ఆర్ ఎస్ పార్టీలు అనైతిక పొత్తులతో ప్రజలను మభ్య పెడుతున్నారు

**నాయకులు పోలీసులను దుర్భాషలు ఆడటం పద్ధతి కాదు**

**మంత్రి పొన్నం ప్రభాకర్**




కరీంనగర్, ఫిబ్రవరి 11(వాయిస్ టుడే): మున్సిపల్ ఎన్నికల్లో గెలవడం కష్టమని తెలిసి బీజేపీ,బిఆర్ఎస్ నాయకులు పోలీసులను దుర్భాషలు ఆడుతూ కార్యకర్తలను రెచ్చగొట్టి గొడవలు సృష్టిస్తున్నారని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ మండి పడ్డారు.కరీంనగర్ డిసిసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజల ఆశీర్వాదంతో 80 శాతం కి పైగా మున్సిపాలిటీ స్థానాలు గెలుస్తుంది.తెలంగాణ ఆశ్చర్యకరంగా బీజేపీ బిఆర్ఎస్ ఒకటిగా కలిసి ఎన్నికల వాతావరణాన్ని ప్రజాస్వామ్యాన్ని అపహాస్యంగా చేసింది.బీజేపీ బిఆర్ఎస్ లు మొగన్ని కొట్టి మొరముర అన్నట్టు సమేత గా ఉంది..ఎక్కడికక్కడ ఘర్షణ వాతావరణం క్రియేట్ చేస్తూ భౌతిక దాడులకు దిగింది.నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడు పోలింగ్ బూత్ లోకి వెళ్లి భయభ్రాంతులకు గురి చేశారు.10 సంవత్సరాలుగాము న్సిపాలిటీ లకు ఏమి చేయలేక నిధులు ఇవ్వలేక ఇప్పుడు ఎన్నికల సమయంలో బీజేపీ మరోసారి ప్రజలను మభ్యపెట్టాలని చూసింది. రెండు సంవత్సరాలో ప్రజా పాలన ప్రభుత్వం లో ఇందిరమ్మ ఇళ్లు,200 యూనిట్ల ఉచిత విద్యుత్, గ్యాస్ సబ్సిడీ,సన్న బియ్యం పంపిణీ,రేషన్ కార్డులు,ఆర్టీసీ లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు,సన్న వడ్లు బోనస్,రైతు భరోసా,రైతు రుణమాఫీ ఎన్నో పథకాలు అమలు చేస్తుంది.బీజేపీ కేంద్ర మంత్రుల నుండి కార్యకర్తల వరకు బి ఆర్ ఎస్ మాజీ మంత్రుల నుండి కార్యకర్తల వరకు కలిసి పని చేశారు.ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారు.ఈరోజు బీజేపీ అన్ని పేపర్లలో పెద్ద పెద్ద యాడ్ ఇచ్చారు.12 సంవత్సరాలుగా కేంద్రంలో మీరే అధికారంలో ఉన్నారు కదా.ఇవన్నీ ఎందుకు చేయలేదు. మున్సిపాలిటీ లలో బీజేపీ తోనే అభివృద్ధి సాధ్యమని వేసారు. భవిష్యత్ లో ఇవన్నీ అమలు చేస్తామని చెప్పారు.కేంద్రం సహకరించండి.రాష్ట్రం అమలు చేస్తుంది.12 సంవత్సరాలుగా మీరే అధికారంలో ఉన్నారు.పట్టణ ప్రాంతాల్లో ఉన్న సమస్యలు పరిష్కరించండి.ప్రజాస్వామ్యబద్ధంగా జరుగుతున్న ఎన్నికలు అపహాస్యం చేసే ప్రయత్నం చేశారు.పోలీసుల మీద దాడులు ,ఘర్షణలు ,ఓటర్లను ప్రలోభపెట్టడానికి చేశారు.10 సంవత్సరాలుగా అధికారంలో ఉన్న పార్టీ విచ్చలవిడిగా సంపాదించిన డబ్బులతో ఓట్లు కొనే ప్రయత్నం చేశారు.ఎవరెన్ని కుట్రలు చేసిన ప్రజా పాలన ప్రభుత్వం ను ప్రజలు ఆశీర్వదించారు.పంచాయతీ ఎన్నికల మాదిరి మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తున్నాం. తెలంగాణ బీజేపీ అధికార దాహం కోసమే. తెలంగాణ ను సాక్షాత్తు ప్రధాని వ్యతిరేకించిన నిధులు ఇవ్వకుండా వివక్ష చూపెడుతూ ప్రధాన మంత్రి కేంద్ర మంత్రులను రాష్ట్ర ముఖ్యమంత్రి,మంత్రులను కలిసిన నిధులివ్వని బీజేపీ నీ ప్రజలు నమ్మే పరిస్థితి లేదు.తెలంగాణ ప్రజల కళ్ళు పడితే కోనసీమ కొబ్బరి చెట్లు ఎండిపోతున్నాయని చెప్పిన పవన్ కళ్యాణ్ తో పొత్తు పెట్టుకున్నారు. ఎన్నికల సమయంలో మత రాజకీయాలు చేస్తూ మత విద్వేషాలు రెచ్చగొడుతూ లబ్ధి పొందే ప్రయత్నం చేశారు.కేంద్ర మంత్రులు ,రాష్ట్ర మాజీ మంత్రులు మున్సిపల్ ఎన్నికల్లో వ్యవహరించిన తీరు సరికాదు. గంగుల కమలాకర్ ఐదేళ్లు మంత్రిగా చేశారు..స్మార్ట్ సిటీ చేశారు భూకబ్జాలు చేసినం అని చెప్పిన ఆయన ఎన్ని గెలుస్తారో చెప్పలేకపోతున్నారు.కేంద్ర ప్రభుత్వం రెండు సంవత్సరాలుగా బడ్జెట్ లో తెలంగాణ కు నిధులు కేటాయించిన బీజేపీకి తెలంగాణలో ఓటు అడిగే హక్కు లేదు అన్నారు.ఈ కార్యక్రమంలో మానకొండూర్ ఎమ్మెల్యే, కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ, సుడా చైర్మన్ కోమటి రెడ్డి నరేందర్ రెడ్డి,జిల్లా గ్రంథాలయ చైర్మన్ సత్తు మల్లేశం,నాయకులు పాల్గొన్నారు.



## సర్పంచ్ కార్యదర్శులతో 15వ ఫైనాన్స్ సమ్మర్ యాక్షన్ పై సమావేశం

బోయినపల్లి ఫిబ్రవరి 11 (వాయిస్ టుడే ప్రతినిధి): మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్, కార్యదర్శుల తో సమ్మర్ యాక్షన్ ప్లాన్ 15వ ఫైనాన్స్ యాక్షన్ ప్లాన్ పై సమావేశం. యాక్షన్ ప్లాన్ గ్రామాల్లో నీటి (తాగునీటి) సమస్య రాకుండా వేసవి కార్యాచరణ ప్రణాళిక. నిధుల వినియోగం, నీటి సరఫరాకు అవసరమైన మరమ్మతులు, కొత్త పైప్‌లైన్ పనులకు నిధుల సద్వినియోగం. నిరంతర పర్యవేక్షణ సర్పంచ్‌లు, కార్యదర్శులు ప్రతిరోజూ నీటి సరఫరాను పర్యవేక్షించలనీ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపిఓ ఎండి షరీఫ్ ఉద్దీన్, గ్రిడ్ ఎండి ముజాహిద్ అన్వర్, డి ఈ ఈ లు ఉమారాణి, సిహెచ్ విశ్వాన్, ఎంపీడీవో జయశీల, ఆర్ డబ్ల్యు అభిషేక్ రావు, ఎంపీ ఓ శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.



## ముదస్సిర్‌ను సన్మానించిన 'సోషల్ ఫోరం '

**విద్యార్థులు అత్యున్నత ప్రతిభను కనబరిచేలా పరీక్షలకు ప్రిపేర్ కావాలి**

ఉమ్మడి వరంగల్, (వాయిస్ టుడే) : తెలంగాణ సోషల్ ఫోరం ఆధ్వర్యంలో ఇటీవల హైదరాబాద్ లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సోషల్ టాలెంట్ టెస్ట్ లో ప్రతిభ కనబరిచి వరంగల్ జిల్లా తృతీయ స్థానాన్ని సాధించేలా కృషి చేసిన ప్రభుత్వ ఉన్నత పాఠశాల,కృష్ణ కాలనీకి చెందిన పదవ తరగతి విద్యార్థి మహమ్మద్ ముదసిర్ ను సోషల్ ఫోరం (ఉర్సు సోషల్ కాంప్లెక్స్) వారు బహుమతిని అందించి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు వీర ఉపేందర్ అధ్యక్షతన బుధవారం మధ్యాహ్నం నిర్వహించిన సమావేశంలో రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచి వరంగల్ జిల్లా కీర్తి ప్రతిష్టలను ఇనుమడింప చేసిన విద్యార్థి ముధసిర్ తోపాటు ఆ విద్యార్థి ప్రతిభ కనబరిచేలా శిక్షణ ఇచ్చి గైడ్ టీచర్లుగా వ్యవహరించిన ఆ పాఠశాల సోషల్ స్టడీస్ స్కూల్ అసిస్టెంట్ ముతోజు సదాలక్ష్మి,కే.రాజేష్ లను పూలదండలు,శాలువాలతో అభినందించి సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా ముదస్సిర్ మాట్లాడుతూ తనలో అంతర్లీనంగా నిక్షిప్తమై ఉన్న జ్ఞానాన్ని వెలికితీస్తూ ప్రతిభాపాటవ పోటీల్లో ప్రతిభ కనబరిచేలా శిక్షణ ఇస్తున్న ప్రధానోపాధ్యాయులకు, ఉపాధ్యాయులకు సహకరిస్తున్న విద్యార్థులకు ధన్యవాదాలు తెలిపారు. మార్చిలో జరగనున్న టెన్త్ క్లాస్ వార్షిక పరీక్షల్లో నాతోపాటు ఈ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు అందరూ అత్యున్నత ప్రతిభను కనబరిచేలా ప్రిపేర్ కావాలని కోరారు. ఈ సందర్భంగా ఆ ఫోరం గౌరవ అధ్యక్షులు భూపాల్ రెడ్డి,ప్రెసిడెంట్ పెరుమాండ్ల సాంబమూర్తి,ప్రధాన కార్యదర్శి ఎం.బిక్షపతి,కోశాధికారి రంగాచారి,సెక్రటరీ శ్రీనివాసరెడ్డి,ఫోరం బాధ్యులు వివేక్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచేలా శిక్షణ ఇచ్చిన సోషల్ స్టడీస్ టీచర్స్ సదాలక్ష్మి,రాజేష్ లు అభినందనీయులని కొనియాడారు. ముధసిర్ చదువు కోసం భవిష్యత్తులో కూడా సోషల్ ఫోరం అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల ఉపాధ్యాయులు,పదవ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు.



## కౌంటింగ్ కేంద్రాన్ని సంయుక్తంగా పర్యవేక్షించిన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్

నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) ఫిబ్రవరి 11: ఎల్లుండి జరగనున్న మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించి ఈరోజు నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఐపీఎస్, జిల్లాలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని సంయుక్తంగా పర్యవేక్షించారు.ఈ సందర్భంగా కౌంటింగ్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, ఎన్నికల నియమ నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలన్నారు. కౌంటింగ్ హాలుల్లో భద్రతా చర్యలు, సీసీటీవీ పర్యవేక్షణ, సిబ్బంది విధుల నిర్వహణ, ప్రవేశ నియంత్రణ వంటి అంశాలపై సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు అందించారు. ఈ పర్యవేక్షణలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల, ఐపీఎస్ తో పాటు జిల్లా అధికారులు, సిబ్బంది ఉన్నారు.

## చదువు కోసం దూరం ఓటు కోసం స్వస్థలం



నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) ఫిబ్రవరి 11 : చదువు కోసం దూర ప్రాంతాల్లో ఉన్న తొలి ఓటు వేయాలని సంకల్పంతో నిర్మల్ పట్టణానికి చెందిన గోనె రోషిని తన బాధ్యతను చాటుకున్నారు బాలాజీ వాడకు చెందిన ఆమె గుంటూరులో సీఏ చదువుతున్నారు మున్సిపల్ ఎన్నికల సందర్భంగా బుధవారం ఆమె ప్రత్యేకంగా పట్టణానికి చేరుకొని తన ఓటు హక్కును వినియోగించుకున్నారు మొదటిసారి ఓటు వేయడం గర్వంగా ఉందని యువత తమ ఓటు హక్కును ఉదా చేయకూడదని రోషిని కోరుకున్నారు.



## పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి,పోలింగ్ సరళిని పరిశీలించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు

కొత్తగూడెం (వాయిస్ టుడే) ఫిబ్రవరి 11 : మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సందర్భంగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజు పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. కొత్తగూడెం, ఇల్లందు అశ్వరావుపేటలలోని పోలింగ్ కేంద్రాల వద్ద పోలింగ్ సరళని పరిశీలించి అక్కడ విధుల్లో ఉన్న అధికారులు సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రాలతో పాటు ఇల్లందులో స్ట్రాంగ్ రూమ్ ల వద్ద బందోబస్తును పరిశీలించారు.మూడు మున్సిపాలిటీల పరిధిలో ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు.

## ఓటు హక్కును వినియోగించుకున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జితేష్ వి. పాటిల్



భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే ఫిబ్రవరి 11: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 48వ డివిజన్‌లో జగ్గు తండ ఎంపీపీ ఎస్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఆయన ఓటు వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి పౌరుడికి లభించిన అత్యంత విలువైన హక్కు ఓటు హక్కు అని తెలిపారు. ప్రజాస్వామ్యంలో మన గళాన్ని వినిపించడానికి ఓటు హక్కు శక్తివంతమైన సాధనం అని అన్నారు. ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు అశ్వరావుపేట, ఇల్లందు మున్సిపాలిటీల పరిధిలో ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేసినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాలలో తాగునీరు, విద్యుత్, భద్రతా ఏర్పాట్లు, అవసరమైన సిబ్బంది నియామకం వంటి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. వృద్ధులు, వికలాంగులు ప్రత్యేక అవసరాలు ఉన్న ఓటర్ల కోసం వీల్‌చైర్ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. అన్ని వర్గాల ఓటర్లు ప్రశాంత వాతావరణంలో ఎలాంటి భయాందోళనలు లేకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, చివరి నిమిషం వరకు వేచి చూడకుండా త్వరితగతిన పోలింగ్ కేంద్రాలకు చేరుకుని ఓటు వేయాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

# నేటి కార్మిక జాతీయ సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

**కార్మిక వ్యతిరేకి కేంద్రంలోని మోదీ సర్కారు**

**యూనియన్లు లేకుండా కుట్రలను చేస్తున్న కేంద్రం**

**ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్**



కాజీపేట, వాయిస్ టుడే: నేటి కార్మిక జాతీయ సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ప్రభుత్వ మాజీ చీఫ్ విప్,వరంగల్ పశ్చిమ మాజీ శాసనసభ్యులు,బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ కార్మిక లోకానికి పిలుపునిచ్చారు. జాతీయ వ్యాప్తంగా కార్మిక వర్గం పిలుపునిచ్చిన సమ్మెకు మద్దతుగా అన్ని కార్మిక సంఘాలతో కలిపి వినయ్ భాస్కర్ బుధవారం వేయి స్తంభాల దేవాలయం నుంచి కాజీపేట రైల్వే స్టేషన్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కాజీపేట రైల్వే స్టేషన్ వద్ద ఆయన మాట్లాడుతూ రేపటి జాతీయ సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని అన్ని కార్మిక సంఘాలకు పిలుపునిచ్చారు. వ్యాపార సముదాయాలు, ఫ్యాక్టరీలు, కార్మికులు, ఉద్యోగులు స్వచ్ఛందంగా బంద్ పాటించి.. సమ్మెలో పాల్గొనాలని కోరారు. కేంద్రంలోని బీజేపీ మోదీ సర్కారు 12 ఏళ్లలో కార్మిక లోకానికి మేలు చేయకపోగా పూర్తిగా కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని విమర్శించారు. 29 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి కార్మికుల హక్కులను కాలరాయాలని కేంద్రం యోచిస్తోందని తెలిపారు. కార్మికులకు పని తగ్గ వేతనం,వేతనం కోసం ఉద్యమం,ఉద్యమించేందుకు యూనియన్లు ఉండకుండా చేయాలనే కుట్రలను కేంద్రం నూతన కార్మిక చట్టాల రూపంలో తీసుకొచ్చిందని వివరించారు. కార్మికులందరు హక్కులు సాధించుకునేందుకు ఐక్యంగా ఉద్యమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్టీయూ హనుమకొండ జిల్లా కన్వీనర్ నాయిని రవి,నాయకులు కాటపూర్ రాజు,రఘు,అరుణ్ కుమార్,రవి,సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి రాగుల రమేష్,ఉప్పలయ్య,చక్రపాణి,కారు ఉపేందర్, ఏఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు సారంగపాణి,రాజు గౌడ్, ఐఎఫ్టీయూ జిల్లా అధ్యక్షులు రాజేందర్,ఏఐసీటీయూ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస రావు,ఎంఏటీఏడీయూ అధ్యక్షులు ఈసంపెల్లి సంజీవ, శ్రీధర్ రెడ్డి,బాబు, జయరాం, పేయింటర్ సంఘం జిల్లా అధ్యక్షులు రాజారపు రాజు,చిరు వ్యాపారుల సంఘం ఎండీ ఇస్మాయిల్, టీబీఎస్ఆర్కే పి.శివకుమార్, భిక్షపతి,రాజు,జిడబ్ల్యూఎంసీ కార్మికసంఘం నాయకులు భిక్షపతి, ధర్మరాజు,రామ్మూర్తి, ప్రతాప రుద్ర ఆటో యూనియన్ నర్సింగ్,హోటల్ వర్కర్స్ యూనియన్ ఆల్ఫా,గౌరవ అధ్యక్షులు బాబు రావు,తదితరులు పాల్గొన్నారు.

# పరకాలలో ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

## 22 వార్డులకు పోలింగ్ నిర్వహణ

## పరకాలలో 80.16 శాతం నమోదైన పోలింగ్

## హనుమకొండ జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ స్నేహ శబరీష్

## పరకాలలో పోలింగ్ సరళీని పరిశీలించిన జిల్లా కలెక్టర్



హనుమకొండ జిల్లా, వాయిస్ టుడే: హనుమకొండ జిల్లాలోని పరకాల మున్సిపాలిటీలో 22 వార్డు స్థానాలకు గాను బుధవారం జరిగిన పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. పరకాల మున్సిపాలిటీ పరిధిలో 44 పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. పోలింగ్ కేంద్రాలలో ఉదయం 7గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు పోలింగ్ సాగింది. ఆయా వార్డుల పరిధిలో ఉన్న పోలింగ్ కేంద్రాలలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పరకాల మున్సిపాలిటీ పరిధిలోని 22 వార్డు స్థానాలకు గాను 44 పోలింగ్ కేంద్రాలలో నిర్వహించిన పోలింగ్ ప్రశాంతంగా సాగినట్లు హనుమకొండ జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ స్నేహ శబరీష్ తెలిపారు. పోలింగ్ 80.16 శాతం నమోదయినట్లు పేర్కొన్నారు. మున్సిపాలిటీ 13 వార్డులను సమస్యాత్మకంగా గుర్తించామని,వీటి పరిధిలో 26 పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ ప్రశాంతంగా సాగేందుకు మైక్రో అబ్జర్వర్లు నియమించినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాలలో వంద శాతం వెబ్ కాస్టింగ్ నిర్వహించినట్లు పేర్కొన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో ప్రశాంతంగా పోలింగ్ కొనసాగేందుకు పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరకాల మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 26,784 ఓటర్లు ఉండగా 21,469 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని కలెక్టర్ వెల్లడించారు. ఉదయం 9 గంటల వరకు 2589 ఓటర్లు ఓటు వేయగా (9.67 శాతం),ఉదయం 11 గంటల వరకు 5904 మంది ఓటర్లు (22.04 శాతం),మధ్యాహ్నం ఒంటిగంట వరకు 14333 మంది ఓటర్లు(53.51 శాతం),మధ్యాహ్నం 3 గంటల వరకు 18,789 ఓటర్లు(70.15శాతం), సాయంత్రం ఐదు గంటల వరకు 21,469 ఓటర్లు ఓటు వేయగా పోలింగ్ 80.16 శాతంగా నమోదయిందని కలెక్టర్ తెలిపారు.

### పోలింగ్ కేంద్రాలను సందర్శించిన జిల్లా ఎన్నికల అధికారి

పరకాల మున్సిపాలిటీ పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను హనుమకొండ జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ స్నేహ శబరీష్ సందర్శించారు. వెలమవాడ లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో (మూడో వార్డు)ఆరో పోలింగ్ కేంద్రాన్ని మోడల్ పోలింగ్ కేంద్రంగా అధికారులు ఏర్పాటు చేయగా కలెక్టర్ స్నేహ శబరీష్,అదనపు కలెక్టర్ ఎన్.రవి పరిశీలించారు. మోడల్ పోలింగ్ కేంద్రంలో పోలింగ్ సరళీని అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా రాజిపేటలోని ప్రాథమిక పాఠశాలల్లో ఏర్పాటుచేసిన 11,12 పోలింగ్ కేంద్రాలను జిల్లా కలెక్టర్,అదనపు కలెక్టర్ సందర్శించారు. ఆయా పోలింగ్ కేంద్రాలలో కొనసాగిన పోలింగ్ ప్రక్రియ గురించి కలెక్టర్ పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులకు కలెక్టర్ పలు సలహాలు సూచనలు చేశారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాలులో పరకాల మున్సిపాలిటీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను వెబ్ కాస్టింగ్ ద్వారా అధికారులు పర్యవేక్షించారు. పోలింగ్ కేంద్రాల పరిశీలనలో కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ తో పాటు పరకాల ఆర్డీవో డాక్టర్ కన్నం నారాయణ,పరకాల మున్సిపాలిటీ కమిషనర్ అంజయ్య,టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ సుష్మ,తహసీల్దార్ విజయలక్ష్మి,ఎంపిడీవో రవీందర్,ఇతర అధికారులు ఉన్నారు.

### పోలింగ్ సరళీని పరిశీలించిన జిల్లా ఎన్నికల పరిశీలకులు

రెండో సాధారణ మున్సిపాలిటీ ఎన్నికలలో భాగంగా పరకాలలో పోలింగ్ ప్రక్రియ ను జిల్లా సాధారణ ఎన్నికల పరిశీలకులు కె.శివకుమార్ నాయుడు పరిశీలించారు. ప్రభుత్వ జూనియర్,డిగ్రీ కళాశాలల్లోని పోలింగ్ కేంద్రాలు,ఉన్నత,ప్రాథమిక పాఠశాలల్లో పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ సరళీని ఎన్నికల పరిశీలకులు శివకుమార్ నాయుడు అధికారులను అడిగి తెలుసుకున్నారు.

### స్ట్రాంగ్ రూమ్ కు బ్యాలెట్ బాక్స్ లు తరలింపు..

పోలింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామగ్రిని పరకాల లోని గణపతి ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూమ్ కు పటిష్ట పోలీస్ బందోబస్తు మధ్య అధికారులు తరలించారు. 22 వార్డుల సంబంధించి 44 పోలింగ్ కేంద్రాల వారీగా బ్యాలెట్ బాక్సులు,పోలింగ్ సామగ్రితో ఎన్నికల సిబ్బంది స్ట్రాంగ్ రూమ్ నకు చేరుకున్నారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద పటిష్ట పోలీస్ భద్రత ఏర్పాటు చేశారు. ఇక్కడే ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రం వద్ద ఈనెల 13వ తేదీన ఓట్ల లెక్కింపు జరగనుంది.

# రైతు బజార్ ఆరోపణలపై విచారణ : యార్లగడ్డ



కృష్ణా జిల్లా-గన్నవరం: గన్నవరం రైతు బజార్ లో అవినీతి జరుగుతుందంటూ వచ్చిన ఆరోపణలపై తక్షణమే విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ప్రభుత్వ విప్,గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆదేశించారు. గన్నవరం రైతు బజార్ లో దుకాణాల కేటాయింపులో అవినీతికి పాల్పడుతున్నట్లు, టమాట, దుంపల విక్రయాలు ఓ వ్యక్తి కనుసన్నల్లో జరుగుతున్నట్లు కొన్ని చానళ్లలో కథనం ప్రసారమైంది. సదరు ఛానల్ లో వచ్చిన కథనాలకు స్పందించిన ఎమ్మెల్యే యార్లగడ్డ రైతు బజార్ లో జరుగుతున్న కార్యకలాపాలపై ఆరా తీశారు. దుంపల విక్రయాల్లో అక్రమాలు జరుగుతున్నాయా లేదా అని అధికారులు, రైతులను అడిగి తెలుసుకున్నారు. సదరు ఛానల్లో వచ్చిన ఆరోపణలపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి నిజాలను నిగ్గు తేల్చాలని, అక్రమాలున్నట్లు తేలితే బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని కృష్ణాజిల్లా మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులను ఆదేశించారు. రైతులు, వినియోగదారుల శ్రేయస్సు కోసం ఏర్పాటుచేసిన రైతు బజార్లలో అక్రమాలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. గన్నవరం నియోజకవర్గంలో అవినీతి, అక్రమాలకు చోటు లేదని, అక్రమాలను ఎట్టి పరిస్థితులను సహించేది లేదని యార్లగడ్డ హెచ్చరించారు. గన్నవరం రైతు బజార్ నిర్వహణలో ఏవైనా లోటుపాట్లు ఉంటే పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేసి పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

# దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు సిపిఎం సంపూర్ణ మద్దతు

## సిపిఎం సూర్యాపేట జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి



సూర్యాపేట (వాయిస్ టుడే) ఫిబ్రవరి 11: కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు ఫిబ్రవరి 12న ఇచ్చిన సార్వత్రిక సమ్మెకు సిపిఎం సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం పేరు మార్చి విబి జి రామ్ జి పేరు పెట్టడం సబబు కాదన్నారు. కార్మిక సంఘాలు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు కోడులుగా చేసిందని అన్నారు. విద్యుత్ సవరణ బిల్లు తీసుకువచ్చి రైతాంగానికి తీవ్ర అనాష్టం కలిగించే చర్యలకు పాల్పడుతుందన్నారు. ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో సిపిఎం శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# విబి జీరాంజీ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలి

## మోడీ ప్రభుత్వ కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ

## ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

## తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టి పెల్లి సైదులు



సూర్యాపేట (వాయిస్ టుడే) ఫిబ్రవరి 11 : కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం వ్యవసాయ కార్మికులకు పొట్ట కొట్టేందుకు పార్లమెంటులో తీసుకువచ్చిన వి బి జి రాంజీ బిల్లును రద్దు చేయాలని, లేబర్ కోడ్లను రద్దు చేయాలని, విద్యుత్ సవరణ చట్టాన్ని ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు ఫిబ్రవరి12న ఇచ్చిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను కార్మిక లోకం జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపల్లి సైదులు పిలుపునిచ్చారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మల్లు వెంకట నరసింహారెడ్డి భవన్ లో ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూబీజేపీ అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఫిబ్రవరి 12న 10 కేంద్ర కార్మిక సంఘాలు దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చాయని తెలిపారు. జిల్లాలోని 23 మండలాలు5 మున్సిపాలిటీలలో ఈ సమ్మె జరుగుతుందని సమ్మెలో కార్మిక వర్గం అధిక సంఖ్యలో పాల్గొని బిజెపి అనుసరిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నిరసనను వ్యక్తం చేయాలని కోరారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, ఉత్పత్తి చేసిన సంపద శ్రమజీవులకే దక్కాలని, సంపదను వికేంద్రీకరించాలని, ప్రభుత్వ రంగ సంస్థల మూసివేత ఆపాలని, కాంట్రాక్ట్ అండ్ అవుట్సోర్సింగ్ వ్యవస్థను రద్దుచేసి ప్రతి ఒక్క కార్మికుని ప్రభుత్వ ఉద్యోగిగా గుర్తించాలని, అంతవరకు కనీస వేతనం 26,000 అమలు చేయాలని, పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరలు తగ్గించాలని, కార్మికులు ప్రజల కొనుగోలు శక్తిని పెంచాలని, విత్తన విద్యుత్ బిల్లులకు సవరణలు ఆపాలని, తదితర అనేక డిమాండ్లతో ఈ దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బిజెపి అధికారంలోకి వచ్చిన గత 12 సంవత్సరాల కాలంలో పెట్టుబడిదారులు కార్పొరేట్ శక్తులకు లక్షల కోట్ల రుణాలను మాఫీ చేస్తూ, పేద మధ్య తరగతి, కార్మికులకు వ్యతిరేకమైన విధానాల అనుసరిస్తున్నదని తెలిపారు. కార్మికులకు భద్రత కల్పించకుండా, సంక్షేమాలు అమలు చేయకుండా నిర్బంధ నియంతృత్వ దౌర్జన్యపూరిత విధానాలతో శ్రమ దోపిడిని నిరాటంకంగా కొనసాగించడానికి చేస్తున్న విధానాలకు వ్యతిరేకంగానే ఈ సమ్మెను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 12 నిర్వహించే జాతీయ సార్వత్రిక సమ్మె చారిత్రాత్మకమైనదని, ఈ సమ్మెల ప్రతి కార్మికుడు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనేక పోరాటాల ద్వారా 2005 సంవత్సరంలో సాధించుకున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పేరు మార్చి వి బి జి రామ్ జి బిల్లును తీసుకువచ్చారని అన్నారు. ఈ బిల్లులో అనేక మార్పులు చేశారని ఈ మార్పుల మూలంగా ఉపాధి కూలీలకు తీవ్ర నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యవసాయ కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా వ్యవసాయ కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు గుంజ వెంకటేశ్వర్లు, నాయకులు రణపంగా అశోక్, ములకలపల్లి సైదులు పాల్గొన్నారు.



# దేశ వ్యాప్త సమ్మెలో ఉపాధి కార్మికులంతా పాల్గొనాలి : దడాల సుబ్బారావు

కృష్ణా జిల్లా-గన్నవరం: ఫిబ్రవరి 12 న భారత కార్మిక సంఘాలు నిర్వహిస్తున్న సమ్మెలో ఉపాధి హామీ కార్మికులు అందరూ పాల్గొనాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు పిలుపునిచ్చారు. బుధవారం మండలం లోని దావాజిగూడెం, అల్లాపురం గ్రామాల్లో ప్రజా సంఘాల ఆద్వర్యం లో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో పాల్గొన్న దడాల సుబ్బారావు మాట్లాడుతూ, దేశంలో ప్రస్తుతం నెలకొన్న ఆర్థిక అసమానతలు, నిరుద్యోగ సమస్య, ధరల పెరుగుదల, రైతులకు న్యాయమైన ధర లేకపోవడం వంటి సమస్యలపై ప్రభుత్వం స్పందించడం లేదని అందుకే కార్మిక సంఘాలు తలపెట్టిన సమ్మెను ప్రతిపక్షాలు, ప్రజా సంఘాలు సంయుక్తంగా నిర్వహిస్తున్నాయన్నారు.

కార్మిక వర్గంతో పాటు కష్టజీవులు, ఉపాధి కూలీలు, సన్నకారు రైతులు, మహిళలు, విద్యార్థులు ఈ సమ్మెలో భాగస్వాములు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి, దేశాన్ని విభజిస్తున్న శక్తులను ఎదుర్కోవడానికి ఇలాంటి ఉద్యమాలు అవసరమని అన్నారు. అందుకే ప్రతి ఒక్కరూ ఈ సమ్మెను జయప్రదం కావడానికి సమ్మె సందర్భంగా జరిగే ప్రదర్శన సభలలో పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమ్మె జయప్రదం కావడం ద్వారా , ప్రజా సమస్యల పరిష్కారానికి మరిన్ని పోరాటాలు బలోపేతం కావడానికి అవకాశం ఉంటుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయకార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మల్లంపల్లి ఆంజనేయులు, రైతు సంఘం మండల కార్యదర్శి సూరగాని సాంబశివరావు, సిఐటియు మండల నాయకులు షేక్ బాబావలీ, మిరప నాగేశ్వరావు కార్మికులు, వ్యవసాయ కార్మికులు, రైతులు పాల్గొన్నారు.

# జిల్లాలో సాయంత్రం 5 గంటల వరకు 73.33% పోలింగ్ నమోదు

## పోలింగ్ సమయం ముగిసినా క్యూలో ఉన్న ప్రతి ఓటరికి అవకాశం

## జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జితేష్ వి. పాటిల్




భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే ఫిబ్రవరి 11: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల్లో సాయంత్రం 5 గంటల వరకు మొత్తం 73.33 శాతం పోలింగ్ నమోదైనట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. జిల్లాలోని మూడు అర్బన్ లోకల్ బాడీల పరిధిలో మొత్తం 106 వార్డులు, 288 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించినట్లు పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 1,85,348 మంది ఓటర్లు ఉండగా, అందులో పురుషులు 88,738 మంది, మహిళలు 96,572 మంది, ఇతరులు 38 మంది ఉన్నట్లు వివరించారు. సాయంత్రం 5 గంటల వరకు మొత్తం 1,35,910 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని తెలిపారు. అశ్వరావుపేట మున్సిపాలిటీలో మొత్తం 16,850 మంది ఓటర్లలో 12,839 మంది (76.20%) ఓటు హక్కు వినియోగించుకోగా, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 1,34,775 మంది ఓటర్లలో 99,992 మంది (74.19%) ఓటు వేశారు. యెల్లందు మున్సిపాలిటీలో 33,723 మంది ఓటర్లలో 23,079 మంది (68.44%) ఓటు హక్కు వినియోగించుకున్నట్లు తెలిపారు. పోలింగ్ సమయం సాయంత్రం 5 గంటలకు ముగిసినప్పటికీ, అప్పటికే పోలింగ్ కేంద్రాల లోపల క్యూలో నిలుచున్న ప్రతి ఒక్కరికి ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం కల్పిస్తున్నామని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. పోలింగ్ ప్రక్రియ పూర్తైన వెంటనే బ్యాలెట్ బాక్సులను కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య సంబంధిత స్ట్రాంగ్ రూములకు తరలించడం జరుగుతుందని తెలిపారు. స్ట్రాంగ్ రూముల వద్ద తగిన భద్రతా సిబ్బందిని నియమించి నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తామని వెల్లడించారు.



# అమరగాయకులు ఘంటసాలకు గన్నవరం వాకర్స్ అసోసియేషన్ ఘననివాళి

కృష్ణా జిల్లా-గన్నవరం: గన్నవరం జడ్పీ బాలుర పాఠశాల క్రీడా మైదానంలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సుప్రసిద్ధ నేపథ్యగాయకుడు సంగీత దర్శకుడు ఘంటశాల వెంకటేశ్వరావు 52వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా గొల్లనపల్లి జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కొల్లి సత్యరావు జగదీశ్వరరావు పాల్గొన్నారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవిఆర్ కిషోర్, కార్యదర్శి చిల్లపల్లి శ్రీనివాసరావు అసోసియేషన్, వ్యవస్థాపక అధ్యక్షులు ముక్కామల సుబ్బారావు మిగతా కార్యవర్గ సభ్యులు ,సంగీత ప్రియులు కలిసి ఘంటసాల చిత్ర పటానికి పూలమాలలు సమర్పించి నివాళులు ఘటించారు. అనంతరం మాట్లాడుతూ 1922, డిసెంబర్ 4న కృష్ణా జిల్లాలోని చౌటపల్లిలో జన్మించిన అమరగాయకుడు ఘంటసాల తన గంభీరమైన కంఠంతో పౌరాణిక, భక్తి ప్రేమ గీతాలకు తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో వేలాది పాటలు పాడి, 'అమర గాయకుడు'గా చిరస్థాయిగా నిలిచిపోయారని వక్తులు కొనియాడారు.. మన దేశం' సినిమాతో సంగీత దర్శకుడిగా మారిన ఆయన, 'పాతాళ భైరవి', 'మాయాబజార్', 'లవకుశ' వంటి క్లాసిక్ చిత్రాలకు చిరస్మరణీయమైన సంగీతాన్ని అందించారని తెలిపారు. కీర్తిశేషులై అర్థ శతాబ్దం గడిచిన మన అందరికి హృదయాల్లో స్థిరస్థాయిగా ఘంటశాల వెంకటేశ్వరరావు నెలకొని ఉన్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ, రాజరావు ,వీసం ప్రసాద్ , డిఎస్ ఆర్కే ప్రసాద్ , పిప్పళ్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు



## ఓం శ్రీ స్వామియే శరణం అయ్యప్ప కడ్తాల్ దేవాలయ అభివృద్ధి కొరకు పదివేల ఒక్కరూపాయి విరాళం

నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) ఫిబ్రవరి 11: సోను మండల కేంద్రానికి చెందినబుధవారం రోజున శ్రీ ధర్మశాస్త దేవాలయ అభివృద్ధి కొరకు శ్రీ లక్కవత్రి సత్యనారాయణ పద్మ దంపతులు సోన్ గ్రామ వాస్తవ్యులు ఆలయ గురుస్వామి నర్సారెడ్డి గారికి 10,001 రు,, విరాళంగా సమర్పించినారు వారికి వారి కుటుంబ సభ్యులకు ఆ అయ్యప్ప స్వామి వారి కరుణ కటాక్షాలు ఎల్లపుడూ ఉండాలని కోరుకుంటూ. ఓం శ్రీ స్వామియే శరణమయ్యప్ప.



## ప్రశాంతంగా ముగిసిన నందికొండ మున్సిపల్ ఎన్నికలు

నాగార్జునసాగర్ ఫిబ్రవరి 11 వాయిస్ టుడే ప్రతినిధి: నందికొండ మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసినట్లు మున్సిపల్ కమిషనర్ అశోక్ రెడ్డి తెలిపారు. బుధవారం నందికొండ మున్సిపాలిటీలోని 12 వార్డులలో నిర్వహించిన ఎన్నికల్లో పోలింగ్ లో 59.70 శాతం జరిగినట్లు తెలిపారు. నందికొండ మున్సిపాలిటీలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ బూత్ లో కాంగ్రెస్ పార్టీ మాజీ సిఎల్పీ నేత కుందూరు జానారెడ్డి దంపతులు , నల్గొండ ఎంపీ రఘువీర్ రెడ్డి , నాగార్జునసాగర్ నియోజకవర్గ శాసనసభ్యులు జై వీర్ రెడ్డి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మున్సిపల్ ఎన్నికల ఏర్పాట్లనునల్గొండ డిసిఆర్బి డిఎస్పి రవి మున్సిపాలిటీ ఎన్నికల భద్రత చర్యలను పరిశీలించారు. ఉదయము 7 గంటల నుండి ఓటింగ్ ప్రారంభమైంది. ప్రతి పోలింగ్ స్టేషన్ వద్ద పోలీసులు భద్రతా చర్యలు తీసుకోవడంతో ఎలాంటి సంఘటనలు జరగకుండా ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. నందికొండ మున్సిపాలిటీలోని 12 వార్డుల గాను 24 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు ఇందులో మొత్తం మహిళ ఓటర్ల సంఖ్య 7079 కాగా పురుషులు 6441 ఇతరులు ఒకటి మొత్తం కలిసి 13521 ఓటర్లు ఉండగా 8069 ఓట్లు నమోదు అయినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.

## భక్తులకు సులభంగా దర్శనం కల్పించేలా ఏర్పాట్లు

**ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**మహాశివరాత్రి జాతర ఏర్పాట్లను పరిశీలించిన ఇంచార్జి కలెక్టర్, ఎస్పీ మహేష్ బి గితే**

వేములవాడ/ రాజన్న సిరిసిల్ల జిల్లా (వాయిస్ టుడే ప్రతినిధి) : మహా శివరాత్రి జాతర సందర్భంగా వేములవాడలో శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో భక్తులకు సులభంగా దర్శనం కల్పించేలా ఏర్పాట్లు చేస్తున్నామని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి జాతర ఏర్పాట్లను బుధవారం ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే, వేములవాడ ఏఎస్పీ రుత్విక్ సాయి ఐపీఎస్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆలయంలో ఏర్పాటు చేస్తున్న క్యూలైన్లు, భక్తుల ఎంట్రీ ఎగ్జిట్ మార్గాలు, పార్కింగ్ సదుపాయాలు తదితర అంశాలను వారు పరిశీలించి, జాతర సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని అధికారులకు సూచించారు. వీఐపీ దర్శనాల కోసం చేసిన ఏర్పాట్లను పరిశీలించి.. అధికారులకు పలు సూచనలు చేశారు. పరిశీలనలో ఆలయ ఈవో ఎల్. రమాదేవి, వేములవాడ ఆర్డీవో రాధాబాయి, ఈఈ రాజేష్, ఆర్అండ్బీ ఈఈ నరసింహాచారి, డీఈ శాంతయ్య, తహసీల్దార్ జయంత్ కుమార్, మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్, టీపీఓ అన్సార్, ఆలయ ఉద్యోగులు, అర్చకులు పాల్గొన్నారు.

## డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్‌ను కలిసిన యార్లగడ్డ

కృష్ణా జిల్లా-గన్నవరం: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ను ప్రభుత్వ విప్ గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మర్యాదపూర్వకంగా కలిశారు. కొద్ది సేపు పలు విషయాలు పై ఇరువురు నేతలు చర్చించారు..గన్నవరం నియోజకవర్గంలో పలు సమస్యలు పరిష్కరించాలని ఆయన దృష్టికి తీసుకెళ్లగా పవన్ సానుకూలంగా స్పందించారని యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు.



# ధనియాకుల గురువయ్య జీవితం స్ఫూర్తిదాయకం

**ధనియాకుల గురువయ్య 27వ వర్ధంతి సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి...**



సూర్యాపేట ఫిబ్రవరి 11 వాయిస్ టుడే ప్రతినిధి : అమరజీవి కామ్రేడ్ ధనియాకుల గురువయ్య జీవితం స్ఫూర్తిదాయకం అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మల్లు వెంకట నరసింహారెడ్డి భవన్ లో పీడిత,ప్రజల ప్రియతమ నేత ధనియాకుల గురువయ్య 27వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరుపేద కుటుంబంలో పుట్టిన గురవయ్య తన జీవితాంతం అట్టడుగు వర్గాలైన వ్యవసాయ కార్మికులు, పేద, మధ్యతరగతి, రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం అలుపెరుగని ఉద్యమాలు నిర్వహించారని అన్నారు. భూస్వాములకు వెట్టి చేస్తున్న పాలేరులను ఏకం చేసి వారికి సంగం పెట్టి జీతాల పెంపు కోసం పోరాటం చేసి అనేక హక్కులను పాలేరులకు సాధించి పెట్టారని అన్నారు. పెన్ పహాడ్ మండలం, అన్నారం గ్రామంలో ఎన్ని నిర్బంధాలు వచ్చినప్పటికీ వాటిని తట్టుకొని గ్రామంలో పార్టీని బలమైన పార్టీగా తయారు చేశారని అన్నారు. పెన్ పహాడ్ మండలంలో బలమైన పార్టీగా సిపిఎంను తయారుచేసి అనేక మందిని ప్రజా ప్రతినిధులుగా తయారు చేశారని గుర్తు చేశారు. సిపిఎం పార్టీ సూర్యాపేట డివిజన్ కార్యదర్శిగా, సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులుగా పనిచేస్తూ సూర్యాపేట తుంగతుర్తి ప్రాంతాలలో పార్టీ నాయకులపై, కార్యకర్తలపై అరాచక శక్తులు చేసే దాడులను తిప్పి కొట్టడంతో పాటు అనేకమంది కార్యకర్తలను కాపాడడంలో గురువయ్య చేసిన కృషి మరువలేనిది అన్నారు. సూర్యాపేట డివిజన్ లో సిపిఎం పార్టీ బలోపేతానికి ఎనలేని కృషి చేశారని ఆయన సేవలను కొనియాడారు. ధనియాకుల గురువయ్య ఆశయ సాధనకై నేటి యువత కంకణ బదులు కావాలని గురవయ్య స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలను ముందుకు తీసుకువెళ్తామని అన్నారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళి అర్పించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోట గోపి అధ్యక్షతన జరిగిన ఈ వర్ధంతి సభలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మట్టిపల్లిసైదులు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బెల్లంకొండ వెంకటేశ్వర్లు, వేల్పుల వెంకన్న, ధనియాకుల శ్రీకాంత్, వీరబోయిన రవి, నాయకులు గుంజ వెంకటేశ్వర్లు, చిన్న పంగి నరసయ్య, అశోక్, సైదులు, శ్రవణ్, శివ, షారుక్, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.



## కేతకీ శిఖర పూజతో వైభవంగా ప్రారంభమైన మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు

ఝరాసంగం, ఫిబ్రవరి 11 (వాయిస్ టుడే) : సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం, లి'దక్షిణ కాశీ'లిగా పేరుగాంచిన ఝరాసంగం శ్రీ కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి జాతర మహోత్సవాలు బుధవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రాంగణంలో శాస్త్రోక్తంగా నిర్వహించిన ధ్వజారోహణం, శిఖర పూజ కార్యక్రమాలతో బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేశారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి. వి. శివరుద్రప్ప, కేతకీ ధర్మకర్తల మండలి చైర్మన్ చంద్రశేఖర్ పాటిల్. పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు అంజయ్య స్వామి, సంగయ్య స్వామి ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చారణల మధ్య పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు హన్మంత్‌రావు పాటిల్, రుద్రప్ప పాటిల్, మల్లయ్య స్వామి, బి. సంగమేశ్వర పాటిల్, సిద్ధన్న పటేల్, నర్సిములు పటేల్, శ్రీను పటేల్, గళ్యప్ప పాటిల్, బి. మల్లన్న, బుజగం సంగప్ప, అర్చకులు బసయ్య స్వామి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశైలానికి వెళ్తూ.. అనంతలోకాలకు



వెల్దండ : శివమాలధారణ ధరించిన ఇద్దరు శివస్వాములు శ్రీశైలం పుణ్య క్షేత్రంలోని మల్లన్నస్వామికి ఇరుముడిని సమర్పించేందుకు ఆటోలో బయలుదేరగా ట్రాక్టర్ ఢీకొనడంతో ఇద్దరూ దుర్మరణం పాలైన ఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం....వికారాబాద్ జిల్లా బొంరాస్‌పేట మండలం ఏర్పుమళ్ల గ్రామానికి చెందిన కడమంచి సత్యనారాయణ(23) కొంత కాలంగా ఆటో నడుపుతూ హైదరాబాద్‌లోని హైటెక్‌సిటీలో ఉంటూ జీవనం సాగిస్తున్నారు. వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలం తెల్లరాళ్లపల్లితండాకు చెందిన కేతావత్ సురేశ్(30) ఆటో నడుపుతూ హైదరాబాద్‌లోని బీరంగూడలో నివాసం ఉంటున్నారు. ఇద్దరూ మాల ధరించడంతో సన్నిధానంలో ఉంటున్నారు. మహాశివరాత్రిని పురస్కరించుకొని ఇరుముడిని సమర్పించేందుకు ఆటోలో బుధవారం బయల్దేరారు. హైదరాబాద్ - కల్వకుర్తి ప్రధాన రహదారిపైన వెల్దండ మండలం కొట్ర రెవెన్యూ శివారులో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఆటోను ఢీకొంది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న శివస్వాములిద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. ఘటనా స్థలానికి ఎస్సై కురుమూర్తి చేరుకొని మృతదేహాలను 108 అంబులెన్సు ద్వారా పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ట్రాఫిక్‌ను నియంత్రించారు. కేతావత్ సురేశ్‌కు భార్య సౌమ్యతో పాటు 8సంవత్సరాల బాబు ఉన్నారు. సత్యనారాయణకు భార్య నందిని, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. మృతుల కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

## పోలింగ్ బూత్‌ల వద్ద ఓటర్లను ప్రభావితం చేస్తున్నమంత్రి వివేక్.. బాల్కసుమన్ నిరసన



చెన్నూర్, ఫిబ్రవరి 11 : చెన్నూర్ మున్సిపాలిటీ ఎన్నికల్లో మంత్రి వివేక్ వెంకట స్వామి అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నాడని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆరోపించారు. ఇందుకు నిరసనగా చెన్నూర్‌లోని అంబేద్కర్ విగ్రహం ముందు బుధవారం బీఆర్ఎస్ నాయకులతో కలిసి నిరసన తెలిపారు.

ఈ సందర్భంగా బాల్క సుమన్ మాట్లాడుతూ మంత్రి వివేక్ వెంకట స్వామి బైక్‌లపై పోలింగ్ బూత్‌ల వద్ద తిరుగుతూ ఓటర్లను ప్రభావితం చేస్తూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. చెన్నూర్, క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో మంత్రి వివేక్ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని ఆయన ఆరోపించారు. చెన్నూర్, క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో మంత్రి వివేక్ తన తన కారులో 15 లక్షల రూపాయలను, మందు కాటన్లను కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు పంపిణీ చేశారని ఆయన ఆరోపించారు.

చెన్నూర్ మున్సిపాలిటీలో రెండవ వార్డ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి భర్త పెద్దింటి శ్రీనివాస్ ఓటర్లకు డబ్బులు బహిరంగంగా పంచుతున్న వీడియో బయటకు వచ్చిందని, దీన్నిబట్టి చూస్తుంటే ఎన్నికలు ఎంత దుర్మార్గంగా జరుగుతున్నాయో స్పష్టమవుతున్నాయని బాల్క సుమన్ అన్నారు. ఓటమి భయంతోనే కాంగ్రెస్ నాయకులు పోలింగ్ బూత్‌ల వద్ద విచ్చలవిడిగా డబ్బులు పంపిణీ చేస్తున్నారని మండిపడ్డారు. ఈ నిరసన కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.?

## జగ్గారెడ్డి తీరు జుగుప్సాకరం

**సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్**

కంది, ఫిబ్రవరి 11: మున్సిపల్ ఎన్నికల విధి నిర్వహణలో ఉన్న పోలీస్ అధికారి, సిబ్బందిని బండ బూతులు తిట్టిన కాంగ్రెస్ నాయకుడు జగ్గారెడ్డిపై వెంటనే కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. సంగారెడ్డిలో పోలీసులపై జగ్గారెడ్డి మాట్లాడిన తీరు అవమానకరమని, ఈ అంశంపై డీజీపీ స్పందించి వెంటనే తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బుధవారం సాయం త్రం సంగారెడ్డిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జగ్గారెడ్డి వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. ఎన్నికల విధి నిర్వహణ కోసం వచ్చిన పోలీస్ అధికారులను బూతులు తిడుతూ వారిపై దాడికి ప్రయత్నించడాన్ని ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు.

పంచాయతీ నుంచి పార్లమెంట్ దాకా ఎన్నికలు ఏవైనా సరే జగ్గారెడ్డి అక్రమాలు చేయకుండా సంగారెడ్డిలో ఎన్నికలు జరగలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థను అపహాస్యం చేయడం జన్మహక్కుగా వ్యవహరిస్తున్న జగ్గారెడ్డిని అదుపు చేయడంలో అధికార వ్యవస్థ పూర్తిగా విఫలమైందన్నారు. పోలీసులు, పోలింగ్ సిబ్బంది, ఓటర్లను భయభ్రాంతులకు గురి చేసిన తీరు అత్యంత బాధాకరమన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో జగ్గారెడ్డి అక్రమాలు, డబ్బుల పంపకాలపై ఫొటోలు, ఆధారాలతో సహా రాష్ట్ర ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసినా ఎందుకు కేసులు నమోదు చేయలేదని ఆయన ప్రశించారు. పోలీసులు, అధికార యంత్రాం గం జగ్గారెడ్డి పట్ల ఉదాసీనంగా ఉండటం వల్ల ఎంతనష్టం జరుగుతుందో అర్థం చేసుకోవాలన్నారు.

## రాష్ట్రస్థాయిలో జిల్లాకు పేరు తేవాలి..

**జిల్లాస్థాయి సీఎం కప్ క్రీడల ముగింపులో డీవైఎస్‌వో సునీల్‌రెడ్డి**

ఖమ్మం సిటీ, ఫిబ్రవరి 11: రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు తమ ప్రతిభను ప్రదర్శించి జిల్లాకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని డీవైఎస్‌వో తుంబూరు సునీల్‌రెడ్డి ఆకాంక్షించారు. రెండు రోజులపాటు ఖమ్మం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహించిన జిల్లాస్థాయి సీఎం కప్ క్రీడా పోటీలు బుధవారం విజయవంతంగా ముగిశాయి. మొత్తం 40 క్రీడాంశాల్లో ఫైనల్ పోటీలు నిర్వహించగా.. ఖమ్మం, మధిర, సత్తుపల్లి, వైరా, పాలేరుతోపాటు కామేపల్లి నుంచి హాజరైన క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. రెండోరోజు హ్యాండ్‌బాల్, ఉషు, జూడో, తైక్వాండో అంశాల్లో పోటీలు జరిగాయి. జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి తుంబూరు సునీల్‌రెడ్డి, ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి కిస్టఫర్, ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ రామారావు పోటీలను ప్రారంభించారు. పటేల్ స్టేడియంతోపాటు ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానాల్లో క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను అభినందిస్తూనే, అక్కడ కూడా రాణించి పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.



Printed by Published by : **Kotha Laxman** on behalf of Kotha Laxman, printed at and published at 10-5-336/2-1, Kishan Nagar, **Editor: Kotha Laxman.**